www.peoplesnews.in

# హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 113 ఆదివారం, సెప్టెంబర్ 06, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400



## 4 రాష్ట్రాల్లో జనగణన

### - ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 05 :** కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముం దుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసిం ది. ఈ ఏడాది డిసెంబర్ 1న మిగతా2లో...

## ఉక్రెయిన్‌పై దాడులకు విరామం..
## పుతిన్ కీలక ఆదేశం



**మాస్కో సెప్టెంబర్ 05 :**రష్యా-ఉక్రెయిన్ మ ధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న యుద్ధంలో శనివారం నాడు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్‌పై మూడు రోజుల పాటు దాడులను నిలిపివేయాలని రష్యా సైన్యాన్ని మిగతా2లో...

# సీట్లు పెరిగితే
# 117 గెలుస్తాం

## - ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం

● కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా? ● సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా ● సిద్దిపేటలోనూ కాంగ్రెస్ దే గెలుపు ● వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు ● ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు ● ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా? ● ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం ● నకిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ● వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం



**హైదరాబాద్,సెప్టెంబర్05 :** ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావా లని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్?కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్ గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ. 22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని మిగతా2లో...

## 'చెత్త సేకరణ'ను రాంకీకి
## అప్పగించొద్దు



● ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి ● లేదంటే సీఎం ఇంటి ముందే 1000 ఆటోల చెత్త పోస్తాం : కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,సెప్టెంబర్ 05 :** చెత్త సేకరణ కాంట్రాక్టును రాంకీ సంస్థకు అప్పగించే యోచనను విరమించుకోవాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. లేకుంటే వెయ్యి స్వచ్ఛ ఆటోల చెత్తను సీఎం ఇంటి ముందు పోస్తామని ఆమె మిగతా2లో...

# మూడు తరాల్ని
# ముంచేశారు

దగ్గర్లోనే కాంగ్రెస్‌ను నిషేధిత జాబితాలో పెట్టే రోజులు

పాలిటెక్నిక్ భూములపై ప్రభుత్వం కన్ను..జీవో 97ను అసెంబ్లీలో

ఎండగడతాం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్






## కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోంది

2ఏతో ప్రజల భూములను లాక్కునే కుట్ర

కేసీఆర్ ప్రభుత్వం బాటలో రేవంత్ కూడా..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



# 264 ఎకరాల్లో
# భారీ ప్రాజెక్ట్...

**హైదరాబాద్,సెప్టెంబర్ 05 :** హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏకంగా రూ. 70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌తో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, హైదరాబాద్‌కు గ్లోబల్ ఏఐ రంగంలో మరింత కీలక స్థానం దక్కనుంది. పీటీఐ కథనం ప్రకారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ హైదరాబాద్‌లో 264 ఎకరాల భూమిని దక్కించుకున్నట్లు శనివారం ప్రకటించింది. ఇక్కడ భారీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ. 70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ డేటా సెంటర్ సామర్థ్యం మిగతా2లో...

దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి

గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం

దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సీఎం రేవంత్




## ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- అధికారులకు కీలక సూచనలు చేసిన స్పీకర్, ఛైర్మన్

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# సీట్లు పెరిగితే 117 గెలుస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**

అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా?, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి మూడు ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కృషి కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా?. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు. మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా?. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీకృత మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

# మూడు తరాల్ని ముంచేశారు

**కరీంనగర్,సెప్టెంబర్ 05 :** 'కాంగ్రెస్ పార్టీనే నిషేధిత జాబితాలో పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.. ఒక్క మంత్రినే బర్తరఫ్ చేయడం కాదు.. ఆ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులొచ్చాయి' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చ కపోవడాన్ని నిరసిస్తూ.. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన 'యువ సమరభేరి' సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్‌లో 24 హామీలు ఇచ్చి 100 రోజుల్లో అమలు చేస్తామని డైలాగులు కొట్టి వెయ్యి రోజులు దాటినా ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. బకాసురుల్లా మేస్తూ, కుంభకర్ణుల్లా పడుకుంటూ, పందికొక్కుల్లా తింటూ పాలనను గాలికి వదిలేశారన్నా రు. 'ఇన్ని రోజులుగా యువతను మోసం చేసిన ధోకేబాజ్ రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి. పేదల భూములను నిషేధిత జాబితాలో పెడుతున్న కాంగ్రెస్‌ను రాబోయే రోజుల్లో ప్రజలే నిషేధిత జాబితాలో పెట్టడం ఖాయం' అని అన్నారు. **పాలిటెక్నిక్ భూములపై కాంగ్రెస్ కన్ను..**సిరిసిల్ల, వేములవాడ (అగ్రహారం) పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులను కలిసి కేటీఆర్ మాట్లాడారు. జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20 రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు బీఆర్ఎస్ పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పాలిటెక్నిక్ కళాశా లలను లేబర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి తెస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 97 వెనుక పెద్ద కుట్ర ఉందన్నా రు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్, సిరిసిల్ల, కరీంనగర్‌లోని విలువైన పాలిటెక్నిక్ భూములు, ఆస్తులను ఇతర అవసరాలకు మళ్లించేందుకే ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. జీవో 97ను రద్దు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులపై కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ పర్యటనలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితర నాయకులు పాల్గొన్నారు. **అలుగునూరులో తృటిలో తప్పిన ప్రమాదం** కేటీఆర్‌కు కరీంనగర్ శివారులోని అలుగునూరు చౌరస్తా వద్ద మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. భారీ క్రేన్‌తో గజమాల వేసి సన్మానించాయి. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు కేటీఆర్‌కు పోటీపడి చేతినిండా రాఖీలు కట్టారు. కేటీఆర్ కారు వెనుక డోర్ తెరిచి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సమయంలో పక్క నుంచి వెళ్తున్న ఓ లారీ ఢీకొట్టడంతో కారు డోర్ స్వల్పంగా దెబ్బతిన్నది.

# 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

**(మొదటి పేజీ తరువాయి)**

గరిష్ఠంగా 1 గిగావాట్ (జీడబ్ల్యూ) వరకు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు ఉపయోగించుకునేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించనున్నారు. అధిక సామర్థ్యం ఉన్న కంప్యూటింగ్ సిస్టమ్స్‌ను నిర్వహించేందుకు లిక్విడ్-కూల్డ్ టెక్నాలజీతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ ప్రాంతంలో నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయని హైపర్‌వాల్ట్ తెలిపింది. ఈ మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించేందుకు హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో వచ్చే మార్పులను బట్టి ఈ ప్రాజెక్ట్‌ను దశలవారీగా చేపట్టనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి, దేశానికి “చారిత్రాత్మకమైనది”గా అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలపై హైదరాబాద్ దృష్టి పెడుతోందని చెప్పారు. “ఈ దశాబ్దం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది. ఏఐ మోడల్స్, వాటిని నడిపించే కంప్యూటింగ్ సామర్థ్యం వేగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా మారుతున్నాయి. ఈ కంప్యూటింగ్ సదుపాయం తెలంగాణలో ఉండటం మనకు ఒక అదనపు ప్రయోజనం” అని రేవంత్ రెడ్డి అన్నారు. డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణంలో గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడంతో పాటు, నీటి వినియోగాన్ని సమతుల్యం చేసే డిజైన్ విధానాలను పాటించనున్నట్లు కంపెనీ తెలిపింది. టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె. కృతివాసన్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ తమ “ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టు-ఇంటెలిజెన్స్” వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఏఐకి సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను టీసీఎస్ క్లౌడ్, ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యాలతో కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. “ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌కు అవసరమైన స్థాయి, ప్రతిభ, టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయి” అని కృతివాసన్ అన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణా రావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

## - రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్



**హైదరాబాద్,సెప్టెంబర్ 05 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. “వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు” అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# 4 రాష్ట్రాల్లో జనగణన

**(మొదటి పేజీ తరువాయి)**

జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (RGI – రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించ నున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# ఉక్రెయిన్‌పై దాడులకు విరామం.. పుతిన్ కీలక ఆదేశం

**(మొదటి పేజీ తరువాయి)**

అధ్యక్షుడు పుతిన్ ఆదేశించారు. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. యుద్ధం ముగింపు కోసం చర్చలు జరిపే ఉద్దేశంతో అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లు మాస్కో చేరుకోవడంతో పుతిన్ తాజా ఆదేశాలిచ్చారు.

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు కొత్త, స్పష్టమైన ప్రతిపాదన తన వద్ద ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చెప్పిన మరుసటి రోజే అమెరికా ప్రత్యేక ప్రతినిధుల మాస్కో పర్యటన చోటుచేసుకుంది.కాగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సైతం చర్చల వేళ దాడులు చేసుకోవద్దని శుక్రవారంనాడు రష్యాకు ప్రతిపాదించారు. తమ వైపు నుంచి ఎలాంటి దాడులు ఉండవని, ప్రత్యర్థి నుంచి కూడా ఇదే ఆశిస్తున్నామని చెప్పారు. ఉక్రెయిన్, రష్యా మధ్య వైమానిక దాడులు పెరిగిన సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు జరుగుతుండటం విశేషం. శుక్రవారం కీవ్‌లోని ఉక్రెయిన్ భద్రతా సంస్థ ఎస్‌బీయూ ప్రధాన కార్యాలయంపై రష్యా డ్రోన్ దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత జరిగిన అత్యంత ప్రముఖ దాడుల్లో ఇది ఒకటిగా చెబుతున్నారు. రాత్రికి రాత్రి 167 డ్రోన్లను రష్యా ప్రయోగించినట్టు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది.

# ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్,సెప్టెంబర్ 05 :** సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ, శాసన మండలి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శాసన వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత సమావేశాల కంటే వేగంగా, సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే అవకాశం ఉందని గుత్తా అన్నారు.సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి? ఆదేశించారు. సభ్యులకు అందించే మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతా వరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్, ఛైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. ధర్నాలు, రాస్తారో కోలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం వేగంగా అసెంబ్లీ అధికారులకు చేరేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలన్నారు.సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందే అందించాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచిం చారు. ఉభయ సభల సమావేశాలు ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం తరఫున సమావేశాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ-బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు.

# 'చెత్త సేకరణ'ను రాంకీకి అప్పగించొద్దు

**(మొదటి పేజీ తరువాయి)**

హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆమె స్వచ్ఛ ఆటో కార్మికులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం రాంకీ సంస్థకు చెత్త సేకరణ బాధ్యతలు అప్పగిస్తోందని, ప్రాపర్టీ ట్యాక్స్ లో కలిపి చెత్త పైసలు వసూలు చేస్తే తమ ఉపాధి దెబ్బతింటుందని కార్మికులు ఆమెతో వాపోయారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, రాంకీ సంస్థకు లాభం చేయడానికి స్వచ్ఛ ఆటో కార్మికుల పొట్టకొట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా స్వయం ఉపాధి పొందుతున్న వారిని రాంకీ సంస్థకు జీతగాళ్లుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. స్వయం ఉపాధి ద్వారా మంచి ఆదాయం పొందుతున్న వారికి నెలకు రూ.16 వేలు మాత్రమే జీతం ఇచ్చేలా రేవంత్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని తప్పుపట్టారు. హైదరాబాద్ లో 20 వేల ఆటోల ద్వారా 40 వేల మంది స్వచ్ఛ ఆటో కార్మికులు ఇంటింటి నుంచి చెత్త సేకరిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. చెత్త సేకరణ యథావిధిగా కార్మికులతోనే చేయించాలని ఆమె డిమాండ్ చేశారు. స్వచ్ఛ ఆటో కార్మికులకు ప్రభుత్వం రూ.20 లక్షల ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. రాంకీ సంస్థ నిర్వహిస్తున్న డంపింగ్ యార్డ్ వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై సీఎం స్పష్టత నివ్వాలన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోంది

**హైదరాబాద్,సెప్టెంబర్ 05 :**

సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

# గురువుల సేవలు అమూల్యం.. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది

- ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించిన లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది





**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)**
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘన సన్మానం నిర్వహించారు. ఎన్టీపీసీ సింధూరా ఇంజినీరింగ్ కళాశాల రోడ్డులోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్, బచ్పన్ ప్లే స్కూల్‌లలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి, మొమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది అధ్యక్షుడు లయన్ మాచీడి మహేందర్ గౌడ్ మాట్లాడుతూ, గురువులు కేవలం విద్యను బోధించేవారే కాకుండా విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకులని అన్నారు. విద్యార్థుల్లో మంచి విలువలు, నైపుణ్యాలు, క్రమశిక్షణను పెంపొందించి, దేశానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి తన జీవితంలో గురువులు అందించిన సేవలను, మార్గదర్శకత్వాన్ని గుర్తుంచుకోవాలని, ఉపాధ్యాయులను ఎల్లప్పుడూ గౌరవించాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు సమాజ నిర్మాణానికి ఎంతో అవసరమని లయన్స్ క్లబ్ సభ్యులు కొనియాడారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు కంకణాల రవిచంద్ర, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆయేషా, వైస్ ప్రిన్సిపాల్ హేమ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సౌజన్య, బచ్పన్ ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలేఖ, పీఈటీ రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహాత్మా మన్నించు..ఏడాదిగా తొలగని గాంధీ విగ్రహ ముసుగు!

**ప్రారంభానికి నోచుకోని జాతిపిత విగ్రహం -**



**పెబ్బేరు, సెప్టెంబర్ 05 :** మున్సిపల్ కేంద్రాలోని అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. గాంధీ విగ్రహ వ్యవహారం. గాంధీనగర్ లోని ఉన్న మహాత్మా గాంధీ పాత విగ్రహం శిథిలావస్థకు చేరడంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఏడాది క్రితం కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.అయితే విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు ముసుగు తొలగించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. నూతన విగ్రహం ఏర్పాటు చేసిన నాటి నుండి నేటి వరకు ముసుగులోనే ఉండటంతో స్థానికుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.జాతిపిత అయిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఇలా ఏడాది పాటు ముసుగులో ఉంచడం సరికాదని, ఇది జాతిపితను అవమానించినట్లేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభోత్సవానికి ముహూర్తం కుదరడం లేదా? లేక ప్రజాప్రతినిధులకు, అధికారులకు సమయం లేదా? అని ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి, గౌరవించాలని డిమాండ్ చేస్తున్నారు.

# పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ





**పెబ్బేరు, సెప్టెంబర్ 05 :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఓపీ, డెలివరీ, ఇన్-పేషెంట్, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని, మలేరియా, డెంగ్యూ నివారణకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.పీహెచ్‌సీలో నర్సింగ్ సిబ్బంది కొరత ఉందని తెలుసుకుని ఇద్దరు నర్సింగ్ ఆఫీసర్లను నియమించామని, త్వరలో కొత్త డాక్టర్‌ను నియమిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ సుధారాణి, ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్, నర్సింగ్ రావు సార్, హెల్త్ సూపర్వైజర్ పార్వతి హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ ఫార్మసిస్ట్ కుమారి, స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ లక్ష్మీ, ల్యాబ్ టెక్నీషియన్ విక్టర్ రాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కేజీబీవీ అంతర్‌గాం విద్యార్థులకు ఎన్టీపీసీ సి ఎస్ ఆర్ ద్వారా పరుపులు, దుప్పట్లు పంపిణీ








**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)**
ఎన్టీపీసీ రామగుండం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ అంతర్‌గాం పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.10.5 లక్షల విలువైన 360 పరుపులు, దిండ్లు, బెడ్‌షీట్లు, దుప్పట్లు శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతి, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ఎన్టీపీసీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కాగా, గతంలో కూడా ఇదే పాఠశాలకు ఎన్టీపీసీ జూ= కార్యక్రమం ద్వారా 360 బంకర్ బెడ్లను అందజేసి ంది.విద్యా మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల అభ్యాసానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంలో ఎన్టీపీసీ నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.పంపిణీ కార్యక్రమంలో శ్రీ ప్రవీణ్ కె. చౌదరి (డీజీఎం--హెచ్ఆర్), శ్రీమతి రమ్య జయరాజ్ (డీజీఎం--హెచ్ఆర్), పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎన్టీపీసీ జూ= బృంద సభ్యులు పాల్గొన్నారు.

# గురువుల సేవలు అమూల్యం

- సమాజ నిర్మాణంలో వారి పాత్ర విశిష్టం
- 32 మంది ఉపాధ్యాయులకు లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది ఘన సన్మానం







**రామగుండం సెప్టెంబర్ 5(పీపుల్స్ న్యూస్)**
విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది అధ్యక్షుడు ఎల్ఎన్. మాచిడి మహేందర్ గౌడ్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న 32 మంది ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.అనంతరం మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను బోధిస్తూ సమాజ నిర్మాణంలో గురువులు విశిష్ట పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. విద్యార్థుల సమక్షంలో ఉపాధ్యాయులను గౌరవించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.గురువుల బోధనలే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శారద అజ్మీరా, ఉపాధ్యాయులు సుధారాణి, హేమలత, రవళి, మణమ్మ, శారద, ప్రతాప్ చారి, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, పీఈటీ విజయ్‌కుమార్, అనంతయ్య, రమేష్, లయన్స్ క్లబ్ జనరల్ సెక్రటరీ ఎల్ఎన్. పైడ సాయి కుమార్, క్లబ్ డైరెక్టర్లు, సభ్యులు జనార్ధన్ పాల్గొన్నారు.

# వినాయక చవితి నేపథ్యంలో రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్



**మంథని,05 సెప్టెంబర్ :** రాబోయే వినాయక చవితి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లకు శనివారం మంథని పోలీస్ స్టేషన్ లో సీఐ స్వామి కౌన్సిలింగ్ నిర్వహించారు.పండుగ సందర్భంగా నేరాలకు పాల్పడటం, విరోధాలు దారితీసే చర్యలు చేపట్టడం,బలవంతపు చందాలు వసూలు చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గుంపులుగా ఏర్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు పాల్పడవద్దని సీఐ హెచ్చరించారు.స్టేషన్ పరిధి విడిచి వెళ్లే ముందు పోలీసులకు సమాచారం అందించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్వామి స్పష్టం చేశారు.వినాయక చవితి సందర్భంగా బీట్ చెకింగ్, నైట్ రౌండ్స్ నిర్వహించడంతో పాటు ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రజలు పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎలాంటి సమస్య ఎదురైనా మంథని పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈ కౌన్సిలింగ్ లో ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

## మజ్జి శ్రీనివాసరావుకు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుభాకాంక్షలు



**పార్వతీపురం, 05 సెప్టెంబర్ :** ఉమ్మడి విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పుట్టినరోజు సందర్భంగా పార్వతీపురం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు జడ్పీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొరతో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు నాయకులను ఆత్మీయంగా పలకరించి, కరచాలనం చేస్తూ పేరుపేరునా అభినందనలు స్వీకరించారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## చర్చలు సఫలం.. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు: ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ జి.వి.ఆర్.ఎస్. కిషోర్



**పార్వతీపురం, 05 సెప్టెంబర్** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలపై ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన చర్చలు సఫలమయ్యాయని ఏపీఎన్జీవో మన్యం జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ జి.వి.ఆర్.ఎస్. కిషోర్ తెలిపారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, రెండు పెండింగ్ డీఏలు, ఒక సరెండర్ లీవ్ మంజూరుకు ప్రభుత్వం అంగీకరించడం పట్ల ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.పెన్షనర్ల కు పూర్వపు అదనపు క్వాంటం పెన్షన్ అమలు, హెల్త్ కార్డుల నెలవారీ చందాను ట్రస్ట్‌కు అప్పగింత, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంపు వంటి నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. త్వరలో ఐఆర్ ప్రకటించడంతో పాటు మిగిలిన కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా శుభవార్త ఉంటుందని తెలిపారుఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏపీజేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, కె.ఎస్.ఎస్. ప్రసాద్, డి.వి. రమణలకు కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయాలపై హర్షం చేస్తూ పార్వతీపురం ఎన్జీవో హోం వద్ద ఉద్యోగులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

## ఎస్సీ, ఎస్టీ ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే విజయచంద్ర



**అమరావతి, 05 సెప్టెంబర్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించారు.ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సమర్థవంతంగా అందేలా తీసుకోవాల్సిన చర్యలు, వారి అభివృద్ధికి అవసరమైన తదుపరి కార్యాచరణపై చర్చ జరిగింది. పార్వతీపురం నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఎమ్మెల్యే విజయచంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి, సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు.

## నాన్ ఇంటర్‌లాకింగ్ పనులతో 10న పలు రైళ్ల రద్దు



**పెద్దపల్లి:** కాజీపేట-బల్లార్షా రైల్వే సెక్షన్‌లో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చే ప్రక్రియ తుది దశకు చేరుకుంటోంది. ఇందులో భాగంగా జమ్మికుంట-పొత్కపల్లి మధ్య 17 కిలోమీటర్ల మేర ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపడుతున్నారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ అధికారులు ఈనెల 10న పలు రైళ్లను పూర్తిగా, మరికొన్నిం టిని పాక్షికంగా రద్దు చేయడంతోపాటు దూర ప్రాంతాల సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను 30 నుం చి 75 నిమిషాల వరకు నియంత్రించ నున్నా రు. దీంతో పలు రైళ్లపై ప్రభావం పడనున్నది.ఈనెల 10న 17003/04 కాజీపేట-సిర్పూర్ టౌన్, బల్లార్షా- కాజీపేట రామగిరి మెము ఎక్స్‌ప్రెస్‌ను పూర్తిగా రద్దు చేశారు. 17033/34 భద్రాచలం రోడ్-బల్లార్షా, సిర్పూర్ టౌన్-భద్రా చలం రోడ్ సింగరేణి మెము ఎక్స్‌ప్రెస్‌ను వరం గల్-బల్లార్షా, సిర్పూర్ టౌన్-వరంగల్ మధ్య పాక్షికంగా రద్దు చేశారు. అలాగే 17011/12 హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్-బీదర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట-సి ర్పూర్ కాగజ్‌నగర్ మధ్య పాక్షి కంగా రద్దు చేశారు.

# 34 ఏళ్ల విద్యా సేవలకు గుర్తింపు

### జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా బందారపు యాదగిరి గౌడ్





**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)**
విద్యారంగంలో 34 సంవత్సరాలుగా విశేష సేవలందిస్తూ, వేలాది మంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన విశ్వ భారతి విద్యాసంస్థల అధినేత, చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్కు పెద్దపల్లి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. శనివారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ హర్ష, జిల్లా విద్యాశాఖ అధికారి శారద చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.విశ్వ భారతి, నవోదయ, సెయింట్ జోసెఫ్, డ్రీమ్ క్రాఫ్ట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గత 34 సంవత్సరాలుగా ఈ ప్రాంత విద్యార్థులకు విద్యా సేవలందిస్తూ, పలు ప్రజా సేవా కార్యక్రమాల్లోనూ ఆయన చురుకుగా పాల్గొంటున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో ఉన్నత లక్ష్యాలను పెంపొందిస్తూ, ఎందరో విద్యార్థులను సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది.ఈ సందర్భంగా బందారపు యాదగిరి గౌడ్ మాట్లాడుతూ.. "దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుంది అనే నమ్మకంతో గత 34 సంవత్సరాలుగా విద్యారంగంలో సేవలందిస్తున్నాను. వేలాది మంది విద్యార్థులకు విద్యను అందించే అవకాశం లభించడం ఎంతో సంతృప్తినిస్తోంది. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం సంతోషంగా ఉంది. ఈ గుర్తింపు నాకు మరింత బాధ్యతను పెంచింది" అని అన్నారు. అవార్డుకు ఎంపిక చేసిన జిల్లా యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.యాదగిరి గౌడ్‌కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కంది రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, స్థానిక కార్పొరేషన్ అధ్యక్షుడు ఆదర్ సందీప్ సమ్మారావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, రవి తదితరులు అభినందనలు, శు భాకాంక్షలు తెలిపారు.అలాగే విశ్వ భారతి విద్యాసంస్థల హెడ్‌మాస్టర్ తిరుపతి గౌడ్, సెయింట్ జోసెఫ్‌కు చెందిన ఆశాలత, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, ఆయా విద్యాసంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ యాదగిరి గౌడ్‌ను అభినందించారు.

# అసెంబ్లీకి రాని కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

- ప్రజల ఓట్లతో గెలిచి ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవడానికా?
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్



**బాలానగర్ సెప్టెంబర్ 06 ( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష నేతగా, గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ శాసనసభకు హాజరుకాకపోవడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ విమర్శించారు. ప్రజలు తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి, ప్రభుత్వాన్ని ప్రశ్నించి, తమ తరఫున పోరాడాలని కేసీఆర్‌ను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, అయితే ఆయన అసెంబ్లీకి దూరంగా ఉంటున్నారని ఆరోపించారు. ప్రజల ఓట్లతో గెలిచి ఎమ్మెల్యేగా, ప్రధాన ప్రతిపక్ష నేతగా జీతభత్యాలు, ఇతర సదుపాయాలు పొందుతూ ప్రజలకు అందుబాటులో లేకపోవడం ఎంతవరకు సమంజసమని మదన్ మోహన్ ప్రశ్నించారు. "ప్రజల పన్నుల సొమ్ముతో జీతభత్యాలు తీసుకుంటూ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఫామ్‌హౌస్‌లో సేదతీరడం ప్రజాసేవ కాదు" అని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవడానికి కాదని, శాసనసభలో తమ గొంతుకగా నిలబడి సమస్యలను పరిష్కరించేందుకు ఎన్నుకున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గం లో నెలకొన్న అభివృద్ధి సమస్యలు, నిరుద్యోగం, రైతుల ఇబ్బందులు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై అసెంబ్లీలో కేసీఆర్ ప్రశ్నించాల్సిన బాధ్యత ఉందన్నారు."ఎనభై వేల పుస్తకాలు చదివిన మేధావిగా చెప్పుకునే కేసీఆర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శాసనసభలో తన గళాన్ని వినిపించాలి. ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రధాన ప్రతిపక్ష నేతే అసెంబ్లీకి దూరంగా ఉండటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం" అని మదన్ మోహన్ అన్నారు. రాజకీయాలపై ఆసక్తి లేకపోతే, ప్రజా సమస్యలపై పోరాడే పరిస్థితి లేకపోతే ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే పదవిని ఎందుకు కొనసాగిస్తున్నారని ఆయన ప్రశ్నించారు."ఇకనైనా కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలి. ప్రజల తరఫున తన బాధ్యతను నిర్వర్తించాలి. అసెంబ్లీకి రావడం ఇష్టం లేకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి గజ్వేల్ ప్రజలకు మరో నాయకుడిని ఎన్నుకునే అవకాశం కల్పించాలి" అని మదన్ మోహన్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో పదవులు ప్రజలకు సేవ చేసేందుకు మాత్రమేనని, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా పదవులను అనుభవించడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. కేసీఆర్ తక్షణమే శాసనసభకు హాజరై తన బాధ్యతలను నిర్వర్తించాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని మదన్ మోహన్ స్పష్టం చేశారు

# బాలలను పనిలోకి కాదు.. బడిలోకి పంపిద్దాం

-- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఆవుల రవీందర్ రెడ్డి



**బాలానగర్ సెప్టెంబర్ 06 ( పీపుల్స్ న్యూస్)**
బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి, ప్రతి బాలుడికి విద్య అందించాలనే లక్ష్యంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సాధన సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం -- బాలలందరినీ బడికి పంపి చదివిద్దాం" అనే నినాదంతో రూపొందించిన గోడపత్రికను బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రపంచాన్ని మార్చాలంటే శక్తివంతమైన ఆయుధం చదువొక్కటే" అనే సందేశంతో సాధన సంస్థ విద్య ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. బాల్యం అనేది చదువుకోవడానికి, ఆటపాటలతో ఆనందంగా గడపడానికి సంబంధించినదని, చిన్నారులను పనుల్లోకి పంపకుండా ప్రతి ఒక్కరూ వారిని పాఠశాలలకు పంపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బాలుడికి విద్య అందేలా చూడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాలతో ఏ చిన్నారి చదువుకు దూరం కాకుండా ప్రభుత్వ పథకాలు, విద్యా అవకాశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. "బాలలను పనిలోకి కాదు.. బడిలోకి పంపిద్దాం. వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దాం" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాధన సంస్థ సభ్యులు బి. అనుషా, రిషి యాదవ్, సిద్దిరాములు గుప్తా, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భరత్ నగర్ లో సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు చిరస్మరణీయం

**-- భరత్‌నగర్ కాలనీలో ఘనంగా 138వ జయంతి వేడుకలు.**



**బాలానగర్ సెప్టెంబర్ 06 ( పీపుల్స్ న్యూస్)** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి వేడుకలను ఈ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరై రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి దేశ ఉపరాష్ట్రపతిగా, అనంతరం రాష్ట్రపతిగా అత్యున్నత పదవులను అధిరోహించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్య, సమాజ అభ్యున్నతికి రాధాకృష్ణన్ చేసిన సేవలు చిరస్మరణీ యమని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఉపాధ్యాయులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, రాధాకృష్ణన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యారంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, కార్యవర్గ సభ్యులు నాగేశ్వర్‌రావు, బాబు, నరేష్‌కుమార్, మూర్తి, సుబ్బారెడ్డి, డేవిడ్, రత్నారావు, వెంకటేష్ యాదవ్, వేణు, సంతోష్, రాజారావు, శ్రీనివాస్, చెన్నకేశవులు, సుకృతం, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, ప్రదీప్, క్రాంతికుమార్, రాము, కవిత తదితరులు పాల్గొన్నారు. విద్యకు విలువ.. ఉపాధ్యాయులకు గౌరవం.. ఇదే రాధాకృష్ణన్ చూపిన మార్గమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం

**టీచర్స్ డే సందర్భంగా డాక్టర్ గడ్డం శ్రీనివాస్ శుభాకాంక్షలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కాలేజీ బోటనీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గడ్డం శ్రీనివాస్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పుతూ ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని పేర్కొన్నారు. భావితరాలను తీర్చిదిద్దే ప్రతి ఉపాధ్యాయుడికి టీచర్స్ డే సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# సెప్టెంబర్ 7వ తేదీన ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగు వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కార్యవర్గ సమావేశాలను జయప్రదం చేయండి

**- బాబురావు యాదవ్ వికలాంగుల హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా మాజీ జిల్లా అధ్యక్షులు**




**ఖమ్మం /సెప్టెంబర్05/(పీపుల్స్ న్యూస్)** సెప్టెంబర్ 7వ తేదీన ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్వీఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించే వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ సదస్సును జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షులు బాబు రాజ్ యాదవ్ పిలుపునిచ్చినారు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ జాతీయ కార్యవర్గ సమావేశాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు జిల్లా పర్యటనల భాగంగా తిరుగుతూ సూరిపల్లి గ్రామంలో వికలాంగుల సమాజాన్నిద్దేశించి మాట్లాడుతూ సమాజంలో అంగవైకల్యంతో అనేక ఇబ్బందులకు గురవుతూ చూపు లేనివారుగా చెవిటివారుగా మూగవారుగా మానసిక వికలాంగులుగా బుద్ధి మాంజా స్థితి కలిగి మతిస్థిమితం లేని వారిగా జీవిస్తున్న వికలాంగుల సమాజానికి మేలు చేయాల్సిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు వికలాంగులకు అనేక హామీలు ఇచ్చి పెన్షన్లు పెంచుతామని చట్టంలో ఉన్నటువంటి వారి హక్కులను కాపాడతామని సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను ఎట్లాయితే అమలు చేస్తున్నామో వికలాంగులకు కూడా సకలాంగులతో సమానంగా అవకాశాలు కల్పిస్తామని ఈ రాష్ట్రంలో ఉన్న వికలాంగుల సమాజానికి వారి వారి జనాభా నిష్పత్తి ప్రకారం ప్రభుత్వ సంక్షేమ రంగాల్లో విద్యలో ఉద్యోగాల్లో హక్కులు అవకాశాలు కల్పిస్తామని అనేక రకాలుగా హామీలు ఇచ్చి వారి ఓట్లను వేసుకొని ఈ రోజున ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి సంవత్సరాలు దాటిన ఇప్పటివరకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోగా కనీసం పింఛన్లు కూడా పెంచి ఇచ్చే పరిస్థితి లేదంటే ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంత అగాయిత్యానికి పాల్పడుతున్నాడో అర్థమవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేసినారు వికలాంగుల సమాజానికి ఈ రకంగా మోసం చేస్తూ వస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే దిగిన బుద్ధి చెప్పటం ఖాయమని ఖమ్మం జిల్లా కేంద్రంగా వికలాంగుల కుల పోరాట సమితి జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తున్న సందర్భంలో ఆ జాతీయ కార్యవర్గ సమావేశాల్లోనే ఈ రాష్ట్ర ప్రభుత్వంపై వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని స్థితిలో ఉన్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పటానికి సరైన నిర్ణయాలు తీసుకొని భవిష్యత్తు పోరాటానికి సిద్ధమవుతామని ఆయన స్పష్టం చేసినారు

## మంత్రులు, అధికారుల పేర్లతో మోసాలు

**- నకిలీ ఐడీ కార్డులతో ఉద్యోగాలు, ఐపీఎల్ టికెట్ల పేరుతో వసూళ్లు**

**- లాల్‌గూడా పోలీసులకు చిక్కిన ఫిట్‌నెస్ ట్రైనర్**



**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)** మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని లాల్‌గూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వనపర్తి జిల్లాకు చెందిన భూక్యా మోహన్ లాల్ (35) కూకట్‌పల్లిలో నివసిస్తూ ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.తార్నాకలోని తాజా కిచెన్ వద్ద ఆర్‌సీబీ--ఎస్ఆర్‌హెచ్ ఐపీఎల్ మ్యాచ్‌కు సంబంధించిన లాంజ్, గ్రౌండ్‌ఫ్లోర్ టికెట్లు ఇప్పిస్తానని ఓ వ్యక్తిని నమ్మించి రూ.1.70 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని రూ.1 లక్ష నగదు తీసుకున్నట్లు తెలిపారు. టికెట్లు ఇవ్వకుండా తప్పించుకోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 237/2026 కింద కేసు నమోదు చేశారు.విచారణలో నిందితుడు పోలీస్ కానిస్టేబుల్, పోస్టల్ శాఖ, పంచాయతీ కార్యదర్శి, గ్రూప్--4 ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. తాను ఓ మంత్రి పేషీలో పనిచేస్తున్నట్లు నమ్మించేందుకు నకిలీ గుర్తింపు కార్డుతో పాటు డిఫెన్స్ లేబొరేటరీస్ స్కూల్‌లో పీజీటీగా పనిచేస్తున్నట్లు మరో ఐడీ కార్డు ఉపయోగించినట్లు వెల్లడించారు.నిందితుడి నుంచి మొబైల్ ఫోన్, పలు నకిలీ ఐడీ కార్డులు, పత్రాలు, చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. ఇతర బాధితుల వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగాలు లేదా ఇతర ప్రయోజనాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మవద్దని, మంత్రులు, ఉన్నతాధికారులతో పరిచయాలున్నట్లు చెప్పే వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# బిజేపి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ అధ్యక్షతన ఘనంగా జరిగిన హనుమాన్ చాలీసా.

**ఖమ్మం /నేలకొండపల్లి/సెప్టెంబర్05/(పీపుల్స్ న్యూస్)** భారతీయ జనత పార్టీ పాగర్తి సుధాకర్ ఇంటి వద్ద హనుమాన్ చాలీసా కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం 41వక్క సార్ల హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించడం జరిగింది భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో ౦జీూ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మాదాసు శ్రీనివాస్ రావు కొత్త కొత్తూరు సర్పంచ్ మాలోత్ కళావతి మరియు ఉపసర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, ఉపధ్యక్షులు పురాణం దివాకర్, కొండా హర్షవర్ధన్, కిసాన్ మోర్చా మండల నాయకులు సూరేపల్లి జ్ఞానరత్నం భక్త బృందం పాల్గొనటం జరిగింది.





## గొడవను మందలించిన వ్యక్తిపై దాడి

**ముగ్గురు నిందితుల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు**







**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)** గాంధీనగర్‌లో అకారణంగా గొడవ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను రాము మందలించడంతో వివాదం తలెత్తింది. దీంతో ఆగ్రహించిన కార్తీక్, రంజిత్, సాయి రామ్‌లు రాముపై దాడికి పాల్పడినట్లు జీడిమెట్ల పోలీసులు తెలిపారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించి సెప్టెంబర్ 5న అరెస్ట్ చేశారు. అనంతరం ముగ్గురిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# రామగుండంలో నాణ్యమైన రోడ్ల నిర్మాణం

- మేయర్ మహంకాళి స్వామి రూ. 40 లక్షల
- ఎన్‌టీపీసీ-సీఎస్‌ఆర్ నిధులతో రోడ్డు పనుల ప్రారంభం

**ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కృషి**





**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)** నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా, పకడ్బందీగా చిరకాలం మన్నేలా రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. శనివారం 34వ డివిజన్ కృష్ణానగర్‌లో ఎన్‌టీపీసీ-సీఎస్‌ఆర్ నిధులు రూ. 40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ స్వప్న ప్రియ భరత్ గౌడ్‌తో కలిసి ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గతంలో ఎన్‌టీపీసీ-సీఎస్‌ఆర్ నిధులు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లేవని, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ చొరవతో ప్రస్తుతం ప్రభావిత ప్రాంతమైన రామగుండంలోనే ఆ నిధులను ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సీఎస్‌ఆర్ నిధులతో యూజీడీ, రోడ్లు, మంచినీటి పైప్‌లైన్లు, వీధిదీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతుల పనులను వేగవంతం చేశామని చెప్పారు. నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రతినిధులంతా శ్రమిస్తున్నారని, ప్రజలు తెచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గట్ల రమేష్, నాయకులు ఆసిఫ్ పాషా, అభిషేక్, గడ్డం శ్రీనివాస్, విజయ్, నగరపాలక సంస్థ ఏఈ మీర్, కాంట్రాక్టర్లు కృపాకర్ రావు, శశికాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదివారం,
సెప్టెంబర్ 06, 2026

హైదరాబాద్
పీపుల్స్ న్యూస్
దినపత్రిక



# కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై సత్తుపల్లిలో బీఆర్ఎస్ రణభేరి

**- విద్యార్థులు, నిరుద్యోగులతో సండ్ర వెంకట వీరయ్య భారీ ర్యాలీ**

ఖమ్మం సెప్టెంబర్ 5




ఎన్నికల సమయంలో యువత, విద్యార్థుల భవిష్యత్తును మార్చుతామని యూత్ డిక్లరేషన్ పేరుతో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 1000 రోజులు పూర్తయినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ చేపట్టిన "1000 రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై పోరుబాట" లో భాగంగా సత్తుపల్లిలో విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ర్యాలీలో యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం జరిగిన సభలో సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. 100 రోజుల్లో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తయినా ఆ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. నెలకు రూ. 4,000 నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, విద్యా భరోసా కార్డులు వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గురుకుల విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సండ్ర ఆరోపించారు. జిల్లాకో యూపీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన, పోటీ పరీక్షల దరఖాస్తు రుసుముల మినహాయింపు వంటి హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, యూత్ డిక్లరేషన్‌లోని ప్రతి అంశంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. "విద్యార్థులు, నిరుద్యోగులు తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చి పోరాడాల్సిన పరిస్థితి రావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా వెంటనే హామీలను అమలు చేయాలి. లేదంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం" అని సండ్ర హెచ్చరించారు.

# ఉపాధ్యాయులు కేవలం విద్యను బోధించేవారు మాత్రమే కాదు.విద్యార్థుల్లో మంచి వ్యక్తిత్వాన్ని , ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, సమాజానికి బాధ్యతగల పౌరులను అందించేమార్గదర్శకులు.

- ●పాఠశాలకరస్పాండెంట్ ,అడ్వకేట్ మహ్మద్ ముదస్సిర్ జుహా,
- ●మన్సూరా సైబర్ హై స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు





బేగంపేట సెప్టెంబర్ 5, (పీపుల్స్ న్యూస్)

ఉపాధ్యాయులు కేవలం విద్యను బోధించేవారు మాత్రమే కాదనీ,వారు విద్యార్థుల్లో మంచి వ్యక్తిత్వాన్ని ,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి,సమాజానికి బాధ్యతగల పౌరులనుఅందించేమార్గ దర్శకులు అని మన్సూరా సైబర్ హైస్కూల్ కరస్పాండెంట్ ,అడ్వకేట్ మహ్మద్ ముదస్సిర్ జుహా అన్నారు. శనివారం ప్రకాశం నగర్ మన్సూరా సైబర్ హై స్కూల్‌లోఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు అందిస్తున్న అమూల్యమైన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి మన్సూరా సైబర్ హై స్కూల్ మాజీ వైస్ ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ తాను ఈ విద్యాసంస్థలో 26 సంవత్సరాలకు పైగా అంకితభావంతో సేవలందించానని ,గుర్తు చేసుకున్నారు. ఎన్నో తరాల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పాఠశాల యాజమాన్యం తనకు సహాయ సహకారాలు అందించారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల ప్రేమ, గౌరవం మరియు కృతజ్ఞతను తెలియజేస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థుల ఆకట్టుకునే ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక శోభను నింపాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అడ్వకేట్ మహ్మద్ ముదస్సిర్ జుహా, ప్రిన్సిపాల్ ఎం. సుష్మ, ఇంజనీర్ మహ్మద్ ముజమ్మిల్ జుహాతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాయక పోడు కాలనీలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు

చెన్నారావుపేట సెప్టెంబర్ 5 :




ఈ ప్రపంచంలో రాయిని వజ్రంలా మార్చగలిగే శక్తి ఉన్న ఏకైక వ్యక్తి ఉపాధ్యాయుడు. నా పిల్లలకు ఎలాంటి లోటు రాకుండా చూసుకుంటున్నానంటే దానికి కారణం నా గురువులే. నాకు చదువు, విచక్షణ నేర్పించి ఇంత మంచి జీవితాన్ని ప్రసాదించిన వారికి నా వందనం. ప్రతిఒక్కరి జీవితంలో టీచర్ ఓ సూపర్ హీరో పాత్ర పోషిస్తారు. కానీ ఆ సూపర్ హీరో ఇచ్చిన స్ఫూర్తి ఎప్పటికీ మనల్ని ముందుకు నడిపిస్తూనే ఉంటుంది. విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో వెలకట్టలేని త్యాగాలు చేసిన ఉపాధ్యాయులందరికీ గురుపూజోత్సవ శుభాకాంక్షలు. గొప్ప విజయా లు సాధించడానికి పట్టుదల ఎంత అవసరమో.. లక్ష్యాన్ని చేరుకునే మార్గం నుంచి పక్కదారి పట్టకుండా చూసే గురువు కూడా అంతే అవసరం. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బొమ్మెర సతీష్ ' జాటోతు పద్మ విద్యార్థులు పాల్గొన్నారు

# కష్టానికి తగిన ఫలితం

**- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన చెన్నారావుపేట మండల ఉపాధ్యాయులు..**

**- జిల్లా కలెక్టర్ సత్య శారద, జిల్లా విద్యాధికారి రంగయ్య నాయుడు గార్ల నుంచి అవార్డుల స్వీకరణ.**

చెన్నారావుపేట సెప్టెంబర్ 5 :



వరంగల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార 2026 ప్రధానోత్సవం వరంగల్లోని ఆకుతోట కన్వెన్షన్ లో ఘనంగా జరిగింది. చెన్నారావుపేట మండలం నుండి శ్రీ ఈదునూరి రవీందర్ రెడ్డి చెన్నారావుపేట ఉపాధ్యాయులు, సంతోష్ కుమార్ ఉప్పరపల్లి ఉపాధ్యాయులు, నల్ల రవి అమీనాబాద్ ఉపాధ్యాయులు, పావని ఎల్లయ్య గూడెం ఉపాధ్యాయురాలు గార్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారద , జిల్లా విద్యాధికారి నాయుడు గార్ల చేతుల మీదుగా తిరస్కారాలను స్వీకరించారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన ఉపాధ్యాయులకు టిఆర్టియు చెన్నారావుపేట మండల శాఖ పక్షాన శుభాకాంక్షలను మండల అధ్యక్షుడు శ్రీ పూజారి సురేందర్ గారు ప్రధాన కార్యదర్శి బానోతు వెంకన్న లు తెలియజేశారు.

# భక్తురాలు పోగొట్టుకున్న బంగారు పుస్తెలతాడు అప్పగించిన ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది.



**యాదగిరిగుట్ట** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి వారి ఆలయానికి దర్శనార్థం వచ్చినహనుమకొండకు చెందిన ఉప్పల రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులతో స్వామివారి దర్శనం అనంతరం కొండ కిందకు వెళ్లే సమయంలో బస్సు ఎక్కే సమయంలో సుమారు 15 గ్రాములు గల బంగారు పుస్తెలతాడు పోగొట్టుకున్నారు. కొండ కిందకు వెళ్లే ఆర్టీసీ బస్సులో పుస్తెలతాడు పోగొట్టుకున్న విషయాన్ని భక్తురాలు వెంటనే అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సిబ్బంది భాస్కర్, విజయ్‌లకు తెలియజేశారు. వారు వెంటనే డ్యూటీ ఆఫీసర్ ఏఎస్ఐ కనకయ్యకు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఎస్పీఎఫ్ సిబ్బంది వెంటనే ఆర్టీసీ బస్సులో ఉన్న భక్తులందరినీ కిందకు దించి తనిఖీ చేపట్టారు. మొదట పుస్తెలతాడు లభించకపోవడంతో బస్సు మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, బస్సు సీటు కింద బంగారు పుస్తెలతాడు లభించింది. లభించిన బంగారు పుస్తెలతాడును ఎస్పీఎఫ్ ఆర్ ఐ కే. శేషగిరిరావు సమక్షంలో భక్తురాలు ఉప్పల రాజ్యలక్ష్మికి అప్పగించారు. తమ బంగారు పుస్తెలతాడు తిరిగి లభించడంతో భక్తురాలు, ఆమె కుటుంబ సభ్యులతో పాటు అక్కడి భక్తులందరూ నిజాయితీ చాటిన హోంగార్డ్స్ ను ఎస్పీఎఫ్ సిబ్బంది సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ ఏఎస్ఐలు రాజయ్య మాణిక్ ప్రభు హోంగార్డు బాలకృష్ణ తదితరులున్నారు.

# కాంగ్రెస్ హామీల అమలుపై బీఆర్ఎస్ పోరుబాట

- ●చందానగర్‌లో భారీ నిరసన.. ప్రజలకు ఇచ్చిన హామీలు ఎక్కడ?
- ●వెయ్యి రోజులు గడిచినా అమలుకు నోచుకోని హామీలపై బీఆర్ఎస్ ధ్వజం









శేర్లింగంపల్లి : సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు పోరుబాట పట్టాయి. కే.టీ.ఆర్ ఆదేశాల మేరకు, కృష్ణారావు, శంబిపూర్ రాజు సూచనలతో బొబ్బ నవత రెడ్డి ఆధ్వర్యంలో చందానగర్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో 420 హామీలను అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. వెయ్యి రోజులు గడిచినా అనేక హామీలను అమలు చేయలేదని విమర్శించారు.

**దళితబంధుపై హామీ ఏమైంది?**

గత ప్రభుత్వ హయాంలో దళితులకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందించిన దళితబంధు పథకానికి తాము అధికారంలోకి వస్తే రూ. 12 లక్షలు అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు గుర్తుచేశారు. అయితే ఆ హామీ నేటికీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.

**ప్రధాన హామీలపై నిలదీత**

వృద్ధులకు రూ. 4 వేల పెన్షన్, వికలాంగులకు రూ. 6 వేల పెన్షన్, మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం వంటి హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ: ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంక్షలు విధించడంతో పలువురు రైతులు నష్టపోయారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతు భరోసా: రైతులకు ఎకరాకు ఏటా రూ. 15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. నిరుద్యోగ భృతి: నిరుద్యోగ యువతకు నెలవారీ భృతి ఇస్తామని చేసిన హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు. విద్యార్థినులకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా పక్కన పెట్టారని ఆరోపించారు. తులం బంగారం: ఆడబిడ్డల వివాహాలకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అంతేకాకుండా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపైనా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు.

**హామీల సాధన వరకు పోరాటం**

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని బొబ్బ నవత రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కుల కోసం, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సాయి బాబా, రంగారావు, కోమండ్ల శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున్ శర్మ, శ్రీకాంత్‌తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ సెప్టెంబర్ 05




ఈ నెల 12 న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని . జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎఫ్ఎసి సెక్రెటరీ శ్రీమతి ఆర్. సిరి సౌజన్య గారు తెలిపారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నెల 12 న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఎఫ్ఎసి సెక్రెటరీ శ్రీమతి ఆర్ సిరి సౌజన్య గారు పాత్రికేయులు సమావేశంలో వెల్లడించారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. న్యాయస్థానాల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకునే కంటే.. పరస్పర అంగీకారంతో సమస్యలను ముగించుకునే రాజీ మార్గమే కక్షిదారులకు నిజమైన రాజమార్గం అన్నారు. ప్రజలకు త్వరితగతిన, అత్యంత సులభంగా, తక్కువ ఖర్చుతో చట్టబద్ధమైన న్యాయం అందించడమే లక్ష్యంగా ఈ నెల 12 న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలు, కక్షిదారులు సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జాతీయ లోక్ అదాలత్లో పెండింగ్లో ఉన్న సివిల్ కేసులు, భూసేకరణ కేసులు మున్సిపల్ ఇన్సూరెన్స్, బ్యాంకు కేసులను కూడా ఎటువంటి ఖర్చులు లేకుండా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు.

# గురువే భావితరాల శిల్పి!

- విద్యార్థి విజయానికి ఉపాధ్యాయుడే బలమైన పునాది
- ఆత్మవిశ్వాసం, విలువలు, నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దాలి
- టీచర్స్ డే వేడుకల్లో మేడ్చల్--మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి






**మేడ్చల్--మల్కాజిగిరి, సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)**
పుస్తకాలు జ్ఞానాన్ని అందిస్తే.. ఆ జ్ఞానాన్ని జీవితంలో ఎలా ఉపయోగించాలో నేర్పేది ఉపాధ్యాయులేనని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్మరించుకున్న కలెక్టర్.. జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక దేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి వినోద్ కుమార్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.విద్యార్థుల కోణంలో ఆలోచిస్తూ వారికి సులభంగా అర్థమయ్యే విధంగా బోధన అందించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, నిరంతరం నేర్చుకునే తత్వం, విషయ పరిజ్ఞానంపై జిజ్ఞాసను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు.

**విజయాన్ని అభినందించాలి.. వైఫల్యంలో ధైర్యం నింపాలి**
విద్యార్థుల్లోని లోపాలను సరిదిద్దడంతో పాటు వారి ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి వెలికితీయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థి విజయం సాధిస్తే అభినందించే గురువు.. వైఫల్యం ఎదురైనప్పుడు ధైర్యం చెప్పి మరోసారి ప్రయత్నించేలా ప్రోత్సహించాలని అన్నారు.ప్రతిరోజూ విద్యార్థులతో కనీసం ఐదు నుంచి పది నిమిషాల పాటు దినపత్రికలు చదివించాలని సూచించారు. దీనివల్ల సామాజిక అవగాహన పెరగడంతో పాటు భవిష్యత్‌లో పోటీ పరీక్షలకు కూడా దోహదపడుతుందని తెలిపారు.

**పాఠశాల తర్వాత కూడా నిలిచేదే నిజమైన విద్య**
పాఠశాల నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా విద్యార్థి జీవితంలో కొనసాగేదే నిజమైన చదువని కలెక్టర్ అన్నారు. పాఠశాలలో నేర్చుకున్న జ్ఞానాన్ని జీవితంలో, సమాజంలో ఆచరణలో పెట్టగలిగినప్పుడే ఉపాధ్యాయుడి బాధ్యత సంపూర్ణంగా నెరవేరినట్లు అవుతుందని పేర్కొన్నారు.



మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక బోధనా విధానాలను ఉపాధ్యాయులు అందిపుచ్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక దేవి అన్నారు. దేశానికి అవసరమైన భావితరాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

**ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం**
అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్ శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. పూల మొక్కలను అందించి అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, జిల్లాలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# చిట్యాల్ కేజీబీవీలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు

- విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..
- చిట్యాల్ కేజీబీవీలో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు
- ఉత్తమ ఉపాధ్యాయురాలు ఉమాదేవికి ఎస్పీ అభినందనలు
- విద్యార్థినులకు పోక్సో చట్టం, సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన
- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్...




**మెదక్ సెప్టెంబర్ 05**
సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిట్యాల్ కేజీబీవీలో శనివారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ఎస్పీ పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి, మార్గదర్శకత్వం ఉంటుందని అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఉమాదేవిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విద్యారంగానికి ఆమె అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం విద్యార్థినులతో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడి పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. బాలికలు తమకు ఎదురయ్యే ఇబ్బందులను పోలీసు అక్క దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు పంచుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు.విద్యార్థినుల విద్యాభ్యాసం, భవిష్యత్తు లక్ష్యాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎంఈఓ, పాఠశాల అధ్యాపకులు, సీఐలు సందీప్‌రెడ్డి, రంగాకృష్ణ, ఎస్ఐ నర్సింలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# తపాలపూర్ పాఠశాలలో సందడిగా స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు





**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెప్టెంబర్ 5**
జన్నారం మండలం తపాలపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలను ఉత్సాహంగా నిర్వహించారు. ప్రజాస్వామ్య ఎన్నికల విధానాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా పరిచయం చేయడంతో పాటు, వారిలో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత ప్రవర్తన, నిర్ణయాత్మక సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఎన్నికలు నిర్వహించారు.విద్యార్థులు అభ్యర్థులుగా పోటీ చేసి, తోటి విద్యార్థులు ఓటు వేసే విధంగా ఎన్నికల ప్రక్రియను చేపట్టారు. ఎన్నికల ద్వారా గెలుపోటములను సమానంగా స్వీకరించడం, భావోద్వేగాలను నియంత్రించుకోవడం, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలను నేర్చుకుంటారని హెడ్‌మాస్టర్ దుంపల తిరుపతి తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులతో త్వరలో ప్రమాణ స్వీకారం చేయించి, కౌన్సిల్ బాధ్యతలను అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యా పరిపాలనలో విశిష్ట ప్రతిభకు కలెక్టర్ కుమార్ దీపక్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెప్టెంబర్ 5**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, విద్యాభివృద్ధికి చేసిన కృషికి మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు రాష్ట్రస్థాయి విశిష్ట ప్రతిభా పురస్కారం--2026 లభించింది. శనివారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కలెక్టర్ పురస్కారం అందుకున్నారు.2025--26లో 43,072గా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య 2026--27లో 45,626కు చేరింది. రెండేళ్లలో నమోదు 10.34 శాతం పెరిగింది. 282 ప్రభుత్వ పాఠశాలల్లో 10 శాతానికి పైగా అదనపు నమోదు సాధించగా, 4,346 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వీడి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. కలెక్టర్ మార్గదర్శకత్వంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఐఎస్, సీసీఓలు, సీఆర్‌పీల సమన్వయం, నిరంతర పర్యవేక్షణతో ఫలితాలు సాధ్యమయ్యాయి. రాష్ట్రస్థాయిలో మంచిర్యాల జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

---కలెక్టర్ మను చౌదరి









**మేడ్చల్--మల్కాజిగిరి, సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలనను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు.శనివారం అంతాయిపల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను కలెక్టర్ సందర్శించి ఎస్ఐఆర్--2026 ప్రక్రియను పరిశీలించారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, ఓటరు కార్డుల్లో వ్యత్యాసాలు ఉన్నవారికి జారీ చేసిన నోటీసులపై వచ్చిన ధ్రువపత్రాలను త్వరగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని సూచించారు.కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం--6, చిరునామా మార్పు కోసం ఫారం--7, మరణించిన లేదా శాశ్వతంగా తరలిపోయిన ఓటర్ల కోసం ఫారం--8పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం వాటిని ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా సహకరించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో కీసర ఆర్డీఓ వెంకట రెడ్డి, ఏఈఆర్ఓ మధుసూదన్ రెడ్డి, బీఎల్ఓలు, అధికారులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో భక్తుల కిటకిట.

**- స్వామివారి నిత్య రాబడి రూ.39.73 లక్షలు**



**యాదగిరిగుట్ట, :**
ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కొండపైన భక్తులతో కిటకిటలాడింది. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీ కారణంగా కొండ కింద లక్ష్మీ పుష్కరిణి, అన్నదాన సత్రం,కళ్యాణ కట్ట, సత్యనారాయణ వ్రత మండపం, పార్కింగ్ ఏరియా, కొండపైన బస్ స్టేషన్, ప్రసాద క్యూలైన్లు, భక్తులతో నిండిపోయింది. భక్తులధికారణంగా స్వామివారి ధర్మదర్శనానికి రెండు గంటలు ప్రత్యేక దర్శనానికి గంట టైం భక్తులు పట్టిందన్నారు. ఆలయంలో జరిగే సుదర్శన నారసింహ హోమం, సువర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం, వేద ఆశీర్వచనం, సాయంత్రం స్వామివారి వెండి జోడు మ్రొక్కు సేవలో పాల్గొని, స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైన అనుబంధ ఆలయమైన శివాలయంలో శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. అనుబంధాలయమైన పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారి ఆలయ నిత్య రాబడిలో భాగంగా శనివారం రోజున రూ.39,73,500,ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్ర చార్యులు ఆలయ ఉప ప్రధాన మంగళగిరి నరసింహమూర్తి అర్చకులు వినయ్ కుమార్ చార్యులు అనిల్ కుమార్ చార్యులు సూపర్డెంట్ వాసం వెంకటేష్, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ మాణిక్ ప్రభు సిబ్బంది గోపి సిద్ధులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ దినోత్సవంలో గురువులకు ఘన సన్మానం

**లక్షెట్టిపేట సెప్టెంబర్ 5 (**
మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.పాఠశాల కార్యదర్శి చింత అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా విద్యా రంగానికి విశేష సేవలు అందించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి చింత అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా తన తండ్రి, దివంగత చింత నర్సింలు రిటైర్డ్ ఉపాధ్యాయులు జ్ఞాపకార్థం పది మంది ఉపాధ్యాయులను సన్మానించి, వారికి చిన్న కానుకలను అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శరత్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కార్యక్రమానికి హాజరై సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఉపాధ్యాయులకు కూడా ధన్యవాదాలు తెలియజేశారు.ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, వారి సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం పాఠశాల విద్యార్థులకు అరటిపండ్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయరాలు లావణ్యరిటైర్డ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# నూతన వధూవరులను ఆశీర్వదించిన విద్యుత్ ఉద్యోగులు, నాయకులు



**అడ్డగూడూర్, సెప్టెంబర్ 5 -**
యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలోని గట్టుసింగారం విద్యుత్ లైన్ మెన్ బెజ్జంకి ఉపేంద్ర చారి గారి కుమార్తె (దేవిక - వెంకటేష్) వివాహం ఈ రోజు తిరుమలగిరి మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకలో 1104 ప్రాంతీయ అధ్యక్షులు పి. యాదగిరి, ఉపాధ్యక్షులు బాబు, మోత్కూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుప్పతి బీరప్ప, దాసరి బాలరాజు, సోమిరెడ్డి పురుషోత్తం రెడ్డి, నాగులపల్లి బీరప్ప, నాగులపల్లి మచ్చగిరి, పయ్యావుల మహేష్, పయ్యాల మచ్చగిరి, లైన్ మెన్ లు ఎస్కే కాజా, కత్తి కాంతారావు, కందుల వెంకన్న తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# గణేష్ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు- --సీపీ వీసీ సజ్జనర్ ఆదేశాలు









**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)**
వినాయక చవితి, నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.బంజారాహిల్స్‌లో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గణేష్ మండపాలను పోలీస్ యాప్‌లో నమోదు చేసి జియో ట్యాగింగ్ చేయాలని, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, భారీ విగ్రహాల తరలింపునకు రూట్ క్లియరెన్స్ పూర్తి చేయాలని ఆదేశించారు.సోషల్ మీడియాలో వదంతులు, విద్వేషపూరిత పోస్టులపై 24 గంటల నిఘా ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పోలీసులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ భక్తులతో సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ సీపీలు, జాయింట్ సీపీ, డీసీపీలు, ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులను సత్కరించిన సైబరాబాద్ సీపీ

**- విద్యార్థులతో ముఖాముఖి..**
**రహదారి భద్రత, మాదకద్రవ్యాలు,**
**సైబర్ మోసాలపై అవగాహన**









**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 5 (పీపుల్స్ న్యూస్)**
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ గచ్చిబౌలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ప్రధానోపాధ్యాయురాలు రెహానా బేగం, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మునీర్ అహ్మద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదగడమే ఉపాధ్యాయులకు అందించే గొప్ప బహుమతని తెలిపారు. రహదారి భద్రత, మహిళల రక్షణ, మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో పోలీసులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని సూచించారు.విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన సీపీ.. వారి ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం, వాహనాల్లో ప్రయాణించేవారు భద్రతా పట్టీ వినియోగించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. మహిళలు, బాలికల భద్రత కోసం మహిళా భద్రతా బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయని, అత్యవసర సమయంలో 100 లేదా 112కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఒకసారి వినియోగించే సంకేత సంఖ్య, రహస్య సంఖ్య, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సీపీ సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ ఏసీపీ



శ్రీధర్, రాయదుర్గం ఎస్‌హెచ్‌ఓ భూపతి, పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్
పీపుల్స్ న్యూస్
దినపత్రిక
ఆదివారం, సెప్టెంబర్ 06, 2026



# విద్యార్థులు భవిష్తత్తును బంగారు బాటలుగా తీర్చిదిద్దుతున్న గురువులు దైవంతో సమానం.

- సమాజ ప్రగతికి బాటలు వేస్తున్న ఉపాధ్యాయులు సేవలు చిరస్మరణీయం, అభినందనీయం.
- భారతరత్న భారత మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా వారికి ఘననివాళులు.
- ఉపాధ్యాయులందరికీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు.
- జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...
- జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పాల్గొన్నారు.






**ఏలూరు, సెప్టెంబరు 05:** జిల్లా పరిషత్తు సమావేశం మందిరంలో శనివారం భారతరత్న భారత మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)లు పూలదండలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రార్థన గీతాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 33 మంది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు, శాలువాలు, పండ్లను ఇచ్చి ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును బంగారుబాటలుగా తీర్చిదిద్దుతున్న గురువులు దైవంతో సమానం అని, గురుపూజా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు ఎంతో పవిత్రమైన దినం అని, ఆదర్శ గురువులు భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులందరికీ ఆదర్శనీయులు అన్నారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా, ఉపరాష్ట్రపతిగా అనంతరం రాష్ట్రపతిగా పనిచేసి విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన మహనీయులు ఈ రోజు పుట్టినరోజుని మనందరం ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. విద్యార్థులు జ్ఞానాన్ని అందించి సంఘంలో ఒక గౌరవనీయ వ్యక్తిగా తీర్చిదిద్దడంలో గురువులు పాత్ర అపారమైనదని అన్నారు. విద్యార్థులకు కేవలం చదువు, జ్ఞానం మాత్రమే కాకుండా సమాజంలో జీవించడానికి కావలసిన సోషల్ స్కిల్స్, ధైర్యము, సహనం, ఓర్పు ఇలాంటి ఎన్నో అమూల్యమైనవి మీచేతులు మీదగా విద్యార్థులకు అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాపథకాలు విద్యార్థులకు అందించుటలో మీ పాత్ర కీలకం అన్నారు. ప్రతి విద్యార్థికి ఒక్కొక్క ప్రతిభ ఉంటుందని దాన్ని గ్రహించి వారిని విద్యావంతులు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పాత్ర అమూల్యమైనది అన్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చక్కగా తింటున్నారు అంటే ఉపాధ్యాయులు కృషి అభినందనీయమని అన్నారు. బడి మానివేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించడంలో, ప్రత్యేక క్లాసులు నిర్వహించి పదవతరగతిలో మంచి ఫలితాలు సాధించటం ఏలూరు జిల్లా ఉపాధ్యాయులు కృషి చాలా ఉందని, ఇదే స్పూర్తితో భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలు సాధించేలా కలిసికట్టుగా కృషిచేద్దామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ శ్రీమతి ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు విద్యతో పాటు విలువలు నేర్పించడం చాలా అవసరమని అన్నారు. క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అందిస్తూ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు సేవలు అభినందనీయం అన్నారు. ఉపాధ్యాయులు సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం ద్వారా మరింత నిబద్ధతతో పనిచేసే స్ఫూర్తి కలుగుతుందన్నారు. ప్రపంచ స్థాయిలో ఉపాధ్యాయులు వృత్తి ఒక్కటే ఉన్నత గౌరవం పొందేదిగా ఉందన్నారు. విద్యార్థులకు మార్గదర్శకులుగా, సత్ప్రవర్తన కలిగిన వారీగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. తల్లిదండ్రులు తర్వాత అంతే స్థాయిలో ఉపాధ్యాయులుపై గౌరవం ఉంటుందన్నారు. విద్యార్థి దశలో మంచి కన్నా చెడును త్వరగా గ్రహిస్తారని ఈ విషయాన్ని గమనించి మంచి మార్గం వైపు మళ్ళించాలన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో పాటు విషయ పరిజ్ఞానాన్ని నేర్పించి వారు ఆకలింపు చేసుకునేలా గురువులు తీర్చిదిద్దాలన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య( చంటి) మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులు తర్వాత మనల్ని సరైన మార్గంలో నడిపించేది గురువు ఒక్కరేనని అన్నారు. ఆ గురువుకి మనమందరం కూడా శిరస్సు వంచి నమస్కరించాలని అన్నారు. గురువు అంటే దైవంతో సమానం అని, విద్యార్థికి సరైన నడకని బాటని వేసి మంచి సంస్కృతి సంప్రదాయాలను అలవర్చి ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దే గురువు పాత్ర చాలా అమోఘమైనదని అన్నారు. మీరు కూడా పిల్లలకి మంచి భవిష్యత్తుపై నిరంతరం శ్రమించాలని, గురువు అంటే దైవం అనే భావం కలిగే విధంగా మీరు ప్రవర్తించాలని కోరారు. విద్యార్థులు ఉన్నస్థితి నుండి ఉన్నతికి తీర్చిదిద్దడంలోనే ఉపాధ్యాయులు పాత్ర కీలకం అని అందుకే మంచి గుర్తింపు పొందుతారన్నారు. మనకు ఎంత ఆధునిక టెక్నాలజీ వచ్చినను మనకు అర్థమయ్యేలా తెలియజేప్పేది

## విపత్తు సమయంలో రాష్ట్ర విపత్తు నివారణ మరియు అగ్నిమాపక దళం సిబ్బంది



**ఏలూరు, సెప్టెంబర్, 5 :** విపత్తు సమయంలో రాష్ట్ర విపత్తు నివారణ మరియు అగ్నిమాపక దళం సిబ్బంది అందించే సేవలు ఎనలేనివని ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) చెప్పారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో 80 లక్షల రూపాయల 15వ ప్రణాళిక సంఘం నిధులతో ప్రభుత్వం అందించిన అధిక నీటి సామర్థ్యం కలిగిన వాటర్ బ్రౌజర్ అగ్నిమాపక వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ తుఫానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాష్ట్ర విపత్తు నివారణ మరియు అగ్నిమాపక దళం సిబ్బంది అందించే సేవలతో ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు కలగకుండా రక్షించుకోగలుతున్నామన్నారు. నూతన వాహనం ద్వారా మరింత మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 7 అగ్నిమాపక కేంద్రాలు ఉన్నామని, 2026 ఏప్రిల్ నుండి ఇప్పటివరకు 135 అగ్ని ప్రమాదాలను నివారించి 2.39 కోట్ల రూపాయల ఆస్తిని అగ్నిప్రమాదాల బారి నుండి రక్షించామన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రాఘవులు, ప్రభృతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో... "ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం"



**ఏలూరు జిల్లా,** కామవరపుకోట,మండలంలోని ఆడమిల్లి వద్ద ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల నందు "ఉపాధ్యాయ దినోత్సవం" వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు అధ్యక్షత వహించిన కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించడం జరిగింది. అనంతరం ఇంఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం మధు ప్రసంగిస్తూ తత్వవేత్తగా , ఉపాధ్యాయునిగా, తొలి ఉపరాష్ట్రపతిగా మరియు రెండవ రాష్ట్రపతిగా మనదేశానికి ఎనలేని సేవలు చేశారని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను కొనియాడడంతో పాటు ఉపాధ్యాయ వృత్తి విశిష్టత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులంతా కలిసి అధ్యాపకులను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐ.క్యూ.ఎ.సి కో ఆర్డినేటర్ డాక్టర్ జి శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు ఎస్ సుశ్యలత, ధారావతు మల్లేష్, ఎం విజయకృష్ణ , పి కల్పన అధ్యాపకేతర సిబ్బంది చంద్రమోహన్, రత్న సిరిలో, కుమార్ రాజాతో పాటు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బాలానగర్ పోలీసులా ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ లో గురువులకు సన్మానం, విద్యార్థులకు అవగాహన

**బాలానగర్ సెప్టెంబర్ 06 ( పీపుల్స్ న్యూస్)**
ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బాలానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రాబూ) లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేశ్ ఆదేశాల మేరకు బాలానగర్ లా అండ్ ఆర్డర్ సీఐ జి. ప్రశాంత్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ జి. ప్రశాంత్ మాట్లాడుతూ--- "విద్యార్థులకు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందిస్తూ సమాజ నిర్మాణానికి పునాదులు వేస్తున్న ఉపాధ్యాయుల సేవలు అమూల్యమైనవి. 'ఒక సదుపాధ్యాయుడు వందలాది మంది భవిష్యత్తును తీర్చిదిద్దగలడు' అన్న సూక్తిని నిజం చేస్తూ, రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న గురువులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ఇరువురు సీఐలు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధరించడం, మైనర్ డ్రైవింగ్ చేయకపోవడం, రోడ్డు భద్రతా నియమాలు పాటించడంపై మార్గదర్శనం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో ఓటీపీలు (ఓటూ), బ్యాంకు వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నివారణ, అవగాహనలో భాగంగా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, అత్యవసర




సమయాల్లో భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని లేదా '100 / 1930' సాయం తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు ఆసక్తికరంగా సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్వేతా, పాఠశాల ప్రధానోపాధ్యాయిని (హెచ్ఎం) అరుణ జ్యోతి, ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

## ల్యాండ్స్ టైం యాప్ ఉపయోగకరం

**- యాప్ వినియోగంతో సమయం ఆదా**
**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం, సెప్టెంబర్ 5,**
భూముల కొనుగోలుదారులు, అమ్మకం దారులకు ల్యాండ్స్ టైం యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందనిరాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మంత్రి క్యాంప్ కార్యాలయం నందు ల్యాండ్స్ టైం యాప్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ల్యాండ్స్ టైం యాప్ ద్వారా ప్రజలు ఒకే వేదికపై భూములు, ప్లాట్లు, ఇళ్లు, ఫ్లాట్లు మరియు ఇతర ప్రాపర్టీలను సులభంగా అన్వేషించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రాపర్టీ యజమానులు, కొనుగోలుదారులు మరియు రియల్ ఎస్టేట్ రంగంలోని వ్యక్తులను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడం ఈ యాప్ ప్రధాన లక్ష్యం అన్నారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత డిజిటల్, సులభతరం మరియు పారదర్శకంగా మార్చే దిశగా ల్యాండ్స్ టైం తన ప్రయాణాన్ని ప్రారంభించడం ద్వారా మన ప్రాంత ప్రజలకు సమయం ఆదా అవుతుందన్నారు. ఈ యాప్ మన ప్రాంతంలో ఆవిష్కృతం చేయడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ప్రజలకు మేలైన సేవలు అందించడం కోసం లైసెన్స్ కలిగిన సర్వేయర్లను అందుబాటులో ఉంచాలన్నారు. దేశవ్యాప్తంగా గుర్తింపు కలిగిన అన్ని లే అవుట్ల వివరాలను అన్ని భాషలలో అందుబాటులో ఉంచడం వలన యాప్ ను సులభతరంగా ఉపయోగించుకోవచ్చని మంత్రి కొండపల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో యాప్ మేనేజింగ్ డైరెక్టర్లు కే రమేష్, ఏ నాని బాబు, ఐ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు

# స్థానిక ఎన్నికల్లో వన్ సైడ్ విక్టరీ సాధించాలి.

- పార్టీలో చేరిన వారు సమన్వయంతో ముందుకు సాగాలి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**గంట్యాడ, సెప్టెంబర్ 5,**
స్థానిక ఎన్నికల్లో వన్ సైడ్ విక్టరీ సాధించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని రామవరం గ్రామంలో శనివారం సొసైటీ మాజీ అధ్యక్షులు పూడి సత్యనారాయణ, శ్యామ్ కుమార్ ల ఆధ్వర్యంలో 58 కుటుంబాల వారు వారి అనుచరులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరికీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలుగుదేశం పార్టీ కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు సీనియర్ నాయకులతో సమన్వయం అవుతూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరిన వారందరికీ స్వాగతం పలికారు. వైసీపీ నాయకులు, రామవరం సొసైటీ మాజీ అధ్యక్షులు పూడి సత్యనారాయణ మరియు వారి అనుచరులతో పార్టీలోకి రావడం వలన తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, యువ నాయకులు లోకేష్ గారి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. పాత, కొత్త నాయకుల కలయికతో స్థానిక సంస్థల ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ వన్ సైడ్ విక్టరీగా మారేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. పార్టీలో చేరిన వారు పార్టీ నియమాలను పాటించి సీనియర్లను అనుసరిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు తెలుగుదేశం పార్టీ అండదండలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర నాయుడు, కొప్పులు వెలమ రాష్ట్ర డైరెక్టర్ అల్లు విజయకుమార్, పద్మశాలి సంఘ రాష్ట్ర డైరెక్టర్ నీలంశెట్టి భాస్కరరావు, పూడి చిన్నంనాయుడు పాల్గొన్నారు.

## ఖరగ్ పూర్ -అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ప్రెస్ కారిడార్ అలైన్మెంట్ చింతలపూడి మీదుగా మార్చాలి



**అమరావతి :** ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని కోరిన ఎమ్మెల్యే రోషన్ కుమార్పశ్చిమ బెంగాల్లోని ఖరగ్ పూర్ నుండి -అమరావతి కి అనుసంధానం చేసే గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడి మీదుగా అలైన్మెంట్ మార్చవలసిందిగా రోషన్ కుమార్ కోరారు .శనివారం ఉండవల్లి లోని ఆయన నివాసంలో కలిసిన అనంతరం ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు.ప్రస్తుతము నాలుగు రాష్ట్రాలను అనుసంధానం చేసే ఈ హైవే కారిడార్ ఏలూరు జిల్లాలో 111 కిలోమీటర్లు మేర విస్తరించనున్నది. చింతలపూడి ప్రాంతంలో కోల్ గ్యాస్ వెలికితీత పనులు ప్రారంభం అయితే అందుకు సంబంధించిన యంత్ర పరికరాలు, సరుకు రవాణా భవిష్యత్తు అవసరాలకు ఈ ప్రాంతానికి మరో హైవే అవసరమున్నది. ఏర్పడనుంది. ప్రభుత్వానికి ఎటువంటి ఆర్థిక భారం లేని రహదారి అలైన్మెంట్ చింతలపూడి మీదుగా వెళ్ళనట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు, ఈ విషయమై స్పందించిన ముఖ్యమంత్రి వర్యులు , కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలియజేశారు.

## మజ్జి శ్రీనివాసరావుకు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుభాకాంక్షలు



**పార్వతీపురం, 05 సెప్టెంబర్** ఉమ్మడి విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పుట్టినరోజు సందర్భంగా పార్వతీపురం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు జడ్పీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొరతో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు నాయకులను ఆత్మీయంగా పలకరించి, కరచాలనం చేస్తూ పేరుపేరునా అభినందనలు స్వీకరించారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## చర్చలు సఫలం.. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు: ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ జి.వి.ఆర్.ఎస్. కిషోర్



**పార్వతీపురం, 05 సెప్టెంబర్ :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలపై ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన చర్చలు సఫలమయ్యాయని ఏపీఎన్జీవో మన్యం జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ జి.వి.ఆర్.ఎస్. కిషోర్ తెలిపారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, రెండు పెండింగ్ డీఏలు, ఒక సరెండర్ లీవ్ మంజూరుకు ప్రభుత్వం అంగీకరించడం పట్ల ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.పెన్షనర్లకు పూర్వపు అదనపు క్వాంటం పెన్షన్ అమలు, హెల్త్ కార్డుల నెలవారీ చందాను ట్రస్ట్కు అప్పగింత, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంపు వంటి నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. త్వరలో ఐఆర్ ప్రకటించడంతో పాటు మిగిలిన కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా శుభవార్త ఉంటుందని తెలిపారుఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏపీజేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, కె.ఎస్.ఎస్. ప్రసాద్, డి.వి. రమణలకు కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయాలపై హర్షం చేస్తూ పార్వతీపురం ఎన్జీవో హోం వద్ద ఉద్యోగులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

## ఎస్సీ, ఎస్టీ ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే విజయచంద్ర

**అమరావతి, 05 సెప్టెంబర్** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాధికారతకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించారు.ఎస్సీ, ఎస్టీ వర్గాలకు



సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సమర్థవంతంగా అందేలా తీసుకోవాల్సిన చర్యలు, వారి అభివృద్ధికి అవసరమైన తదుపరి కార్యాచరణపై చర్చ జరిగింది. పార్వతీపురం నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఎమ్మెల్యే విజయచంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి, సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు.

# ఉపాధ్యాయులే సమాజ నిర్మాణ శిల్పులు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- విద్యార్థుల ప్రతిభను గుర్తించి సరైన మార్గంలో నడిపించాలి
- జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి
- జిల్లాలో 90 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం





**విజయనగరం, సెప్టెంబర్ 05:** భావి తరాలను తీర్చిదిద్దుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ సాధికారిక శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, తమ శిష్యులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే ఉపాధ్యాయులకు నిజమైన గర్వకారణమని పేర్కొన్నారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ సాధికారిక శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తెలుగు తల్లి, భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, నేటి ప్రతి విద్యార్థి ప్రత్యేక వ్యక్తిత్వం, భిన్నమైన ఆసక్తులు, ప్రత్యేక సామర్థ్యాలు కలిగి ఉంటారని, వారి ప్రతిభను గుర్తించి సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఒక విద్యార్థి బలాలను గుర్తించి, "నువ్వు చేయగలవు.. నువ్వు విజయం సాధించగలవు" అంటూ ప్రోత్సహించే శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉందన్నారు. ఉపాధ్యాయుల ప్రేరణ విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది, సమాజానికి ఉత్తమ పౌరులను అందిస్తుందని పేర్కొన్నారు. నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలకు ప్రాధాన్యం ఇస్తోందని, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో 1,90,000 ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించడం జరిగిందని, ఇటీవల 16,500 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు.తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశాలు విద్యార్థుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు తమ పిల్లల విద్యా ప్రగతి, ఆసక్తులు, సామర్థ్యాలు, భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించడంలో ఈ సమావేశాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సేవాభావంతో విద్యార్థుల జీవితాలకు సరైన దిశానిర్దేశం చేస్తూ భావి తరాలను సమర్థులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, మానవ వనరుల వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో దేశంలో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉండేదని, ముఖ్యంగా మహిళల అక్షరాస్యత మరింత వెనుకబడి ఉండేదని గుర్తుచేశారు. విద్య ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయులు విద్యా రంగాభివృద్ధికి బలమైన పునాదులు వేశారని అన్నారు.ఉపాధ్యాయులు, విద్యావంతుల కృషితో దేశం హరిత విప్లవం, శ్వేత విప్లవం, సమాచార సాంకేతిక విప్లవాలను సాధించి ప్రపంచానికి తన సామర్థ్యాన్ని చాటిందన్నారు. సమాజాన్ని నాలెడ్జ్ సొసైటీగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఒకప్పుడు ఉత్తరాంధ్ర ప్రాంతంలో అక్షరాస్యత శాతం తక్కువగా ఉండేదని, నేడు విజయనగరం జిల్లాను విద్యా రంగంలో ముందంజలో నిలిపేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తూ అనేక మంది ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు.జిల్లాలో ఈ ఏడాది పదో తరగతిలో సుమారు 92 శాతం ఉత్తీర్ణత సాధించడం ఉపాధ్యాయుల సమిష్టి కృషికి నిదర్శనమన్నారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రభుత్వ పాఠశాలలు ఏ ప్రైవేట్ విద్యాసంస్థలకు తీసిపోవని నిరూపించాయని పేర్కొన్నారు.ప్రతి పాఠశాల విద్యార్థులకు రెండో ఇల్లులాంటిదని, ఉపాధ్యాయులు తమ జీవితంలో అత్యధిక సమయాన్ని విద్యార్థులతోనే గడుపుతారని కలెక్టర్ అన్నారు. విద్యార్థుల ఆలోచనా విధానం, వ్యక్తిత్వ వికాసంపై ఉపాధ్యాయుల ప్రభావం ఎంతో ఉంటుందని తెలిపారు.నేటి విద్యార్థులందరూ ఒకే విధమైన ఆసక్తులు, సామర్థ్యాలు కలిగి ఉండరని, ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించాలని సూచించారు. విద్యార్థులతో నిరంతరం మమేకమై వారి ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా కెరీర్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి మార్గాలను తెలియజేయాలని ఉపాధ్యాయులను కోరారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల అవసరాలు, అభిరుచులను అర్థం చేసుకుని వారిని సమర్థవంతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, భావి సమాజాన్ని నిర్మించే మహత్తర బాధ్యత అని అన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించడంలో గురువుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకులుగా నిలవాలని అన్నారు. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి భవిష్యత్కు సరైన దిశానిర్దేశం చేయాలని కోరారు.నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, వారిని విలువలతో కూడిన విద్యతో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

### జిల్లా విద్యా వ్యవస్థలో పురోగతి

జిల్లా విద్యాశాఖాధికారి యు. మాణిక్యం నాయుడు ప్రారంభ ఉపన్యాసం చేస్తూ, విజయనగరం జిల్లాలో విద్యా రంగం నిరంతరం పురోగతి సాధిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, విద్యార్థుల అభ్యసన ఫలితాల మెరుగుదలకు విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఉపాధ్యాయుల సమిష్టి కృషితో జిల్లా విద్యార్థులు విద్యా, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు.

### 90 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో వివిధ స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 90 మంది ఉపాధ్యాయులను మంత్రి, జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యా రంగానికి వారు అందిస్తున్న విశిష్ట సేవలను కొనియాడారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులు అమరావతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సత్కారం అందుకోనున్నట్లు తెలిపారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి, గురువు--శిష్య సంబంధం, విద్యా ప్రాముఖ్యతను ప్రతిబింబించే గీతాలు, నృత్య ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రతిభకు అతిథులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిజిటల్ పరిజ్ఞానంతో మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- డిజిటల్ టెక్నాలజీని అందిపుచ్చుకుంటే అపార అవకాశాలు
- 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యంతో నైపుణ్యాలు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్టీఆర్ జిల్లా/ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 05, 2026**

స్వయం సహాయక సంఘాల మహిళలు డిజిటల్, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడంతో పాటు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు.ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తల కోసం నిర్వహించిన వర్క్షాప్ ఆన్ డిజిటల్ అండ్ టెక్నాలజీ అవేర్నెస్ ఫర్ ఎస్ హెచ్ జీ ఎంటర్ప్రెన్యూర్స్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ హాజరై మహిళలను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాపార రంగంలో డిజిటల్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా ఉత్పత్తుల ప్రచారం, మార్కెటింగ్, కస్టమర్లకు చేరువ కావడం, ఆన్లైన్ విక్రయాలు, ప్రభుత్వ--ప్రైవేటు సంస్థలతో వ్యాపార అవకాశాలు వంటి అనేక ప్రయోజనాలను పొందవచ్చన్నారు. 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త లక్ష్యానికి అనుగుణంగా ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే స్థాయికి ఎదగాలని, ఈ క్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలు కేవలం ఉపాధి పొందేవారిగా కాకుండా ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.మహిళలు తయారుచేస్తున్న ఉత్పత్తులకు నాణ్యత, ప్యాకేజింగ్, బ్రాండింగ్తో పాటు డిజిటల్ మార్కెటింగ్పై అవగాహన పెంచుకోవడం ద్వారా మరింత పెద్ద మార్కెట్ను చేరుకోవచ్చన్నారు. వర్క్షాప్లో డీఎక్స్ఎడ్జ్ ఏ సీఐఐ నుంచి రిసోర్స్ పర్సన్ ప్రసన్న, వాల్ మార్ట్ వృద్ధి సంస్థ నుంచి రిసోర్స్



పర్సన్ శ్రీనివాస్, జెమ్ నుంచి రిసోర్స్ పర్సన్ యశ్వంత్ పాల్గొని డిజిటల్ టెక్నాలజీ, ఈ-కామర్స్, డిజిటల్ మార్కెటింగ్, ఆన్లైన్ వ్యాపార అవకాశాలు, ప్రభుత్వ సంస్థలకు ఉత్పత్తులు/సేవలను అందించే అవకాశాలు తదితర అంశాలపై మహిళా పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు తమ చిన్నతరహా వ్యాపారాలను మరింత విస్తరించుకుని స్థానిక మార్కెట్ నుంచి జాతీయ స్థాయి మార్కెట్ వరకు తమ ఉత్పత్తులను తీసుకెళ్లేలా ఈ వర్క్షాప్ దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

# మహమ్మద్ షమీని ధీటుగా ఎదుర్కొంటాం



**• సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ వెల్లడి**

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ కోసం అన్ని విధాల సిద్ధమయ్యామని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ తెలిపాడు. మహమ్మద్ షమీని సమర్థవంతంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం చెన్నై వేదికగా ప్రారంభమయ్యే దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలో ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శనివారం మీడియా సమావేశంలో పాల్గొన్న తిలక్ వర్మ.. సౌత్ జోన్ తరఫున కేఎల్ రాహుల్ ఆడటం లేదని స్పష్టం చేశాడు. దేవదత్ పడిక్కల్‌తో పాటు సిరాజ్ బరిలోకి దిగుతున్నారని చెప్పాడు. 'సీనియర్ పేసర్ మహమ్మద్ షమీని అడ్డుకునేందుకు సిద్ధంగానే ఉన్నాం. ఈ మ్యాచ్ రసవత్తరంగానే ఉండబోతుంది. గత మ్యాచ్‌లో షమీ ఎలా బౌలింగ్ చేశాడో మేం గమనించాం. బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. అతని బౌలింగ్‌ను ఎదుర్కొని సత్తా చాటుతాం. కేఎల్ రాహుల్ ఈ మ్యాచ్ ఆడటం లేదు.'అని తిలక్ వర్మ తెలిపాడు. 54 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ తలపడుతున్నాయి. ఈ ఇరు జట్లు దులీప్ ట్రోఫీ ఫైనల్లో తలపడటం ఇది రెండోసారి మాత్రం. చివరి సారిగా 1970-71 సీజన్‌లో ముంబైలోని బ్రాబోర్న్ స్టేడియంలో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో సౌత్ జోన్ 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓవరాల్‌గా సౌత్ జోన్ దులీప్ ట్రోఫీ ఫైనల్ చేరడం ఇది 24వ సారి. ఇప్పటి వరకు సౌత్ జోన్ 13 టైటిళ్లు గెలిచింది. మరోవైపు 13 ఏళ్ల తర్వాత ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్.. చివరి సారిగా 2012-13 సీజన్‌లో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఇప్పటి వరకు 8 సార్లు ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్ రెండు టైటిళ్లు మాత్రమే గెలిచింది.

ఈ ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకానున్నాడు. అతని పదవీకాలంపై ఇటీవల పెద్ద చర్చే జరిగింది. అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ.. వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉంది. ఈ విషయంపై చెన్నైలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా-అగార్కర్ మధ్య సమావేశం జరగనుంది. ఇటీవల బీసీసీఐ నిర్వహించిన రివ్యూ మీటింగ్‌కు అగార్కర్ హాజరు కాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల అతను ఈ మీటింగ్‌కు దూరంగా ఉన్నాడు. ఆసియా గేమ్స్ కోసం నెట్ బౌలర్లను ఎంపిక చేయనున్నారు. మయాంక్ యాదవ్, కార్తిక్ త్యాగితో పాటు మోహ్‌సిన్ ఖాన్‌కు అవకాశం రానుంది.

# సీఎస్కే కెప్టెన్ మార్పు తప్పదా?



జట్టు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత సారథి రుతురాజ్ గైక్వాడ్‌ను తప్పించి, వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌కు పగ్గాలు అప్పగించాలని ఫ్రాంచైజీకి సూచించారు. గత మూడు సీజన్లుగా చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా ప్లేఆఫ్స్ అర్హత సాధించడంలో విఫలమైంది. మరోవైపు 2026 సీజన్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ వ్యక్తిగత ప్రదర్శన కూడా తీవ్ర విమర్శలకు దారితీసింది. పవర్‌ప్లేలో అత్యంత తక్కువ స్ట్రైక్ రేట్ నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచిన రుతురాజ్, 28 సగటుతో కేవలం 337 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ క్రమంలో శాంసన్ జట్టులోకి రావడంతో నాయకత్వ బాధ్యతలు ఆయనకే అప్పగించాలనే డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి. సీఎస్కే ఎప్పుడూ స్థిరత్వానికి ప్రాధాన్యమిస్తుందని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోదని గుర్తుచేసిన రమేశ్.. తాజా పరిస్థితుల దృష్ట్యా మార్పు అనివార్యమని పేర్కొన్నారు. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మాట్లాడిన ఆయన.. "కెప్టెన్సీ మార్పు అవసరమా లేదా అనే అంశంపై సీఎస్కే పలు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు కనిపిస్తోంది. సంజూ శాంసన్ ఒక అద్భుతమైన టీమ్ ప్లేయర్ కాబట్టి అతడి పేరును తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. ఒకవేళ కెప్టెన్సీని మార్చాలనుకుంటే శాంసన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. ఐపీఎల్‌లో 66 మ్యాచ్‌లకు సారథ్యం వహించిన సంజూ 33 విజయాలు సాధించి, 50 శాతం విజయాల రేటును కలిగి ఉన్నాడు. అతని కెప్టెన్సీలోనే రాజస్థాన్ రాయల్స్ ఫైనల్‌కు చేరడంతో పాటు మరోసారి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. అయితే కేవలం సంజూను కెప్టెన్ చేసినంత మాత్రాన ట్రోఫీ గెలవలేరు, జట్టులో మరికొన్ని అంశాలను కూడా మార్చాల్సి ఉంది" అని విశ్లేషించారు. మరోవైపు మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ కూడా గతంలో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "రుతురాజ్ నుంచి కెప్టెన్సీ బాధ్యతలను తప్పిస్తే అతడు బ్యాటర్‌గా మరింత స్వేచ్ఛగా, మెరుగ్గా రాణించగలడు. అతనిపై నుంచి నాయకత్వ భారాన్ని తొలగించడం ఎలాంటి కఠిన నిర్ణయం కాదు. అది ఆటగాడితో పాటు ఫ్రాంచైజీకి కూడా మేలు చేస్తుంది" అని బద్రీనాథ్ పేర్కొన్నారు.

# ఏడుగురు ఆటగాళ్ళపై పాకిస్థాన్ వేటు



ఇంగ్లండ్ జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో పాకిస్థాన్ జట్టు చిత్తుగా ఓడిపోయింది. దీంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు జట్టు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా, జట్టులో పెను మార్పులకు శ్రీకారం చుడుతూ, ఏకంగా ఏడుగురు ఆటగాళ్ళపై వేటు వేసింది. ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాక్ జట్టు 194 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. దీంతో సిరీస్ మధ్యలోనే సమూల మార్పులు చేపడుతూ ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించింది. అలాగే, రెడ్-బాల్ కోచింగ్ సిబ్బందిపై కూడా వేటు వేసింది. వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్, ఓపెనర్ ఇమామ్-ఉల్-హక్, పరిమిత ఓవర్ల క్రికెట్ మాజీ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘాతో పాటు అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, ముహమ్మద్ అవైస్ జాఫర్, ఖుర్రం షాజాద్లను జట్టు నుంచి విడుదల చేస్తున్నట్లు పీసీబీ ప్రకటించింది. వీరి స్థానంలో ఏడుగురు కొత్త ఆటగాళ్లను ఎంపిక చేసింది. వీరిలో సైమ్ అయూబ్, అబ్దుల్లా ఫజల్లకు టెస్ట్ అనుభవం ఉండగా, అరాఫత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బేగ్, మహమ్మద్ ఇమ్రాన్, రజావుల్లాలకు తొలిసారిగా టెస్ట్ జట్టులో చోటు లభించింది. ఆటగాళ్లపైనే కాకుండా కోచింగ్ సిబ్బందిలోనూ మార్పులు చేసింది. టెస్ట్ క్రికెట్ హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించింది. వారి స్థానంలో ఈ పర్యటన ముగిసే వరకు వైట్-బాల్ కోచ్ మైక్ హెసన్, యాష్లే నోఫ్కేలకు అదనపు బాధ్యతలు అప్పగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో పాకిస్థాన్ ఇప్పటికే 0-2తో వెనుకబడగా.. ఆటగాళ్ల పేలవ ఫామ్, గాయాల వివాదాలే ఈ మార్పులకు ప్రధాన కారణమని తెలుస్తోంది. కాగా, ఇరు జట్ల మధ్య మూడో టెస్ట్ మ్యాచ్ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభంకానుంది.




# క్రికెట్ పిచ్‌పై భారత్ జపాన్ ఫ్రెండ్ షిప్..

భారత్, జపాన్ దేశాల మధ్య 75 సంవత్సరాల ద్వైపాక్షిక దౌత్య సంబంధాల వేడుకలను పురస్కరించుకుని ఇరు దేశాల పురుషుల జట్లు ప్రత్యేక అంతర్జాతీయ టీ20 మ్యాచ్ లో పాల్గొననున్నాయి. ఈ మ్యాచ్ కోసం 'సుజుకి కప్' ను నిర్వహించనున్నట్లు జపాన్ క్రికెట్ అసోసియేషన్ (జేసీఏ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సంయుక్తంగా అధికారిక ప్రకటన చేశాయి. జపాన్‌లోని తోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా సెప్టెంబర్ 22న ఈ చారిత్రాత్మక పోరును నిర్వహించనున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్ 75' పేరుతో ఈ క్రీడా సంబంధాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం ఇండియా చేస్తున్న ప్రయత్నాలకు కూడా ఈ భాగస్వామ్యం ఊతమివ్వనుంది. ఆ సమయంలో జపాన్ వేదికగా జరిగే ఏషియన్ గేమ్స్ లో పాల్గొనే భారత పురుషుల జట్టులోని స్టార్ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ వంటి ఆటగాళ్లు ఈ చారిత్రక మ్యాచ్ లో బరిలోకి ఆడనున్నారు. ఈ విశేష సందర్భంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ, "ఈ అరుదైన మ్యాచ్ లో భాగస్వామి కావడం బీసీసీఐకి ఎంతో సంతోషాన్నిస్తోంది. భారత జట్టు సరికొత్త గడ్డపై అడుగుపెట్టడానికి, జపాన్ తో పాటు తూర్పు ఆసియా ప్రాంతంలో క్రికెట్ ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ఇదొక గొప్ప అవకాశం. ఇరు దేశాల మధ్య ఉన్న చిరకాల మైత్రికి ఈ మ్యాచ్ మరింత వన్నె తెస్తుంది. సంప్రదాయ క్రికెట్ దేశాలకు ఆవల కూడా ఆటను విస్తరించడం ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ బోర్డుగా బీసీసీఐ బాధ్యత" అని తెలిపారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ జట్టును జపాన్ హోమ్ గ్రౌండ్‌కు ఆహ్వానించడం తమ అసోసియేషన్‌కు దక్కిన గౌరవమని జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నవోకి అలెక్స్ మియాజీ పేర్కొన్నాడు. "భారత క్రికెట్ అభిమానుల ఉత్సాహాన్ని స్వాగతించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. జపాన్ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో స్టేడియానికి వచ్చి ఆటను ఆస్వాదించి మా జట్టును ప్రోత్సహించాలి" అని అతడు వ్యాఖ్యానించాడు. ఈ ప్రత్యేక పోరు ద్వారా ఈస్ట్ ఆసియా మార్కెట్ లో క్రికెట్ క్రేజ్ ను పెంచడానికి బీసీసీఐ, జేసీఏ పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయని తెలుస్తోంది. రాబోయే కాలంలో జపాన్ లో క్రికెట్ మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు బీసీసీఐ సాంకేతిక సహకారాన్ని కూడా అందించనుంది.

# జోనల్ సవాల్

**టైటిల్ వేటలో తిలక్ వర్మ, ఇషాన్ కిషన్**

**నేటి నుంచి దులీప్ ట్రోఫీ ఫైనల్**

చెన్నై : దేశవాళీ క్రికెట్‌సర్క్యూట్‌లో జోనల్ సవాల్‌కు రంగం సిద్ధమైంది. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్‌లు తాడోపేడో తేల్చుకునేందుకు సై అంటున్నాయి. తిలక్ వర్మ సారథ్యంలో సౌత్ జోన్ టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుండగా.. భారత ఆటగాళ్లు దేవదత్ పడిక్కల్, మహ్మద్ సిరాజ్ చేరికతో ఆ జట్టు అవకాశాలు మరింత పెరిగాయి. ఇషాన్ కిషన్ కెప్టెన్సీలో ఈస్ట్ జోన్ 2013 తర్వాత తొలిసారి దులీప్ ట్రోఫీపై కన్నేసింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ, వెటరన్ పేసర్ మహ్మద్ షమి ఈస్ట్ జోన్ అవకాశాలను రెట్టింపు చేస్తున్నారు. మహ్మద్ షమి, శ్రేయాస్ గోపాల్‌కు ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో ఇది వందో మ్యాచ్ కావటం విశేషం.**వైభవ్‌పైనే ఫోకస్** వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో, భారత వైట్‌బాల్ క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టించడానికి ముందు అతడి కెరీర్‌ను మలుపు తిప్పిన ఇన్నింగ్స్ ఆస్ట్రేలియా అండర్-19పై చెపాక్‌లో బాదినదే. 58 బంతుల్లోనే సెంచరీతో యూత్ టెస్టులో వైభవ్ రికార్డు నెలకొల్పాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ నుంచి బరిలోకి దిగుతున్న వైభవ్ మళ్లీ ఆ తరహా విధ్వంసక ఇన్నింగ్స్‌పై గురిపెట్టాడు. శనివారం ప్రాక్టీస్ సెషన్లోనూ సూర్యవంశీ తనదైన శైలిలోనే రెచ్చిపోతూ సాధన చేయటం గమనార్హం. ఇటీవల శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో వరుస సెంచరీలు సాధించిన దేవదత్ పడిక్కల్ సౌత్ జోన్ నుంచి బరిలోకి దిగుతున్నాడు. భీకర ఫామ్‌లో ఉన్న పడిక్కల్‌ను ఈస్ట్ బౌలర్లు ఏ మేరకు నిలువరిస్తారో చూడాలి. కెఎల్ రాహుల్ సౌత్ జోన్ తుది జట్టులో ఆడటం లేదని కెప్టెన్ తిలక్ వర్మ తెలిపాడు. మహ్మద్ సిరాజ్ మరో హైదరాబాదీ పేసర్ సీవీ మిలింద్ సౌత్ జోన్ తరఫున పేస్ బాధ్యతలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దులీప్ ట్రోఫీ ఫైనల్ ఉదయం 9.30 గంటలకు ఆరంభం కానుంది.

# ప్రిన్స్ యాదవ్ పై బీసీసీఐ ఫోకస్!



ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా రీఎంట్రీపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి అతడికి ఇప్పటివరకు ఫిట్‌నెస్ క్లియరెన్స్ రాలేదు. రాబోయే అఫ్గానిస్థాన్ టీ20 సిరీస్, 2026 ఏషియన్ గేమ్స్ కోసం ఎంపిక చేసిన స్క్వాడ్స్‌లో బుమ్రా పేరు ఉన్నా, అతడి పాల్గొనడం ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని సమాచారం. ఇంగ్లాండ్‌తో జూలై 16న జరిగిన రెండో వన్డేలో బుమ్రా మోకాలికి మరోసారి ఇబ్బంది ఎదురైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంతకాలంగా వేధిస్తున్న మోకాలి సమస్య మరింత పెరిగినట్లు సమాచారం. ఆ మ్యాచ్ తర్వాత అతడు బౌలింగ్ చేయలేదు. ప్రస్తుతం రికవరీ ప్రక్రియ కొనసాగుతోంది. తను టీమిండియా లోకి ఎప్పుడు వస్తాననేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. బుమ్రా రీఎంట్రీ తేదీపై స్పష్టత లేకపోవడంతో సెలెక్టర్లు బ్యాకప్ ప్లాన్‌పై దృష్టి పెట్టినట్లు తాజా నివేదిక పేర్కొంది. ఈ క్రమంలో పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను ప్రాబబుల్ బ్యాకప్‌గా గుర్తించినట్లు సమాచారం. బుమ్రాతో పాటు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా కూడా ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. వీరికి వారం రోజుల పాటు మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులు నిర్వహించే అవకాశం ఉంది. ఈ పరీక్షల్లో ఫిట్‌నెస్ నిరూపించుకున్న తర్వాత సెప్టెంబర్ 10న ఢిల్లీ చేరే టీమ్‌తో కలిసే అవకాశం ఉంటుందని బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి.బుమ్రా విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరుపై మాజీ ఇండియా బ్యాటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. గత ఏడాది జనవరిలో బుమ్రాకు ఎదురైన వెన్ను గాయం తర్వాత అతడి వర్క్‌లోడ్‌ను జాగ్రత్తగా మేనేజ్ చేస్తున్నా, వరుసగా ఫిట్‌నెస్ సమస్యలు రావడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నాడు. బుమ్రా విషయంలో నిర్ణయాలు తీసుకునేది కెప్టెన్, కోచ్, సెలెక్టర్లేనని, అయినప్పటికీ తను టీమిండియాలో రెగ్యులర్ గా ఆడటం లేదని బద్రీనాథ్ అన్నాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేవలం ఆటగాడి శారీరక పరిస్థితి, అతడు ఏ మ్యాచ్‌లకు ఆడే స్థితిలో ఉన్నాడో సమాచారాన్ని మాత్రమే అందిస్తుందని తెలిపాడు. బుమ్రా ఒక్కడే కాదు. నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్ కూడా ప్రస్తుతం గాయాల కారణంగా ఆటకు దూరంగా ఉన్నారు. దీంతో కీలక సిరీస్‌లకు ముందు ఇండియా టీమ్ ఫిట్‌నెస్ పరిస్థితిపై ఆసక్తి నెలకొంది. మరోవైపు ప్రపంచకప్ మరో ఏడాది మాత్రమే సమయం ఉండటంతో బుమ్రా ఫిట్ నెస్ సాధించకపోవడం, తరచూ గాయపడుతుండటంపై భారత అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# నాని సినీ ప్రయాణానికి 18 ఏళ్లు..

## ఫ్యాన్స్‌కు నేచురల్ స్టార్ స్వీట్ మెసేజ్




హీరో నాని సినీ ప్రయాణం 18 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అభిమానులు, ప్రేక్షకులకు అతడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు. వారి ప్రేమను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదని చెప్పారు. ఇకపై కూడా అలా చేయబోనని స్పష్టం చేశాడు.

"18 ఏళ్లు.. అధికారికంగా సినిమాల్లో పెద్దవాడినయ్యా" అంటూ నాని 'ఎక్స్'లో పోస్టు చేశాడు. "మీ ప్రేమను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదు.. ఇకపై కూడా తీసుకోబోను" అని రాసుకొచ్చాడు.

నాని హీరోగా పరిచయమైన తొలి చిత్రం 'అష్టా చమ్మా'. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 2008 సెప్టెంబర్ 5న విడుదలైంది. అప్పటి నుంచి నటుడిగా మొదలైన నాని ప్రస్థానం హీరోగా, నిర్మాతగా ఎదిగే స్థాయికి చేరింది.

ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'లో నటిస్తున్నాడు. ఎస్ఎల్‌వీ సినిమాస్ నిర్మిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలుత మార్చి 26న విడుదల చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత ఆగస్టు 21కి మార్చారు. చివరగా సెప్టెంబర్ 24కు వాయిదా వేశారు. ఇటీవల విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. రక్తంతో తడిసిన లుక్‌లో నాని కనిపించడం అభిమానుల్లో ఆసక్తి పెంచింది. రెండు జడలతో కనిపిస్తూ.. చేతిలో బ్లేడ్‌లతో చేసిన గొలుసుతో నాని కనిపించే సన్నివేశాలు టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అణచివేతకు గురైన ప్రజలు తిరుగుబాటు చేయడం చుట్టూ కథ సాగుతుందనే సంకేతాలు టీజర్ ఇచ్చింది. ఇందులో మోహన్‌బాబు ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. "ఈ దేశం ఎవరిది? మనది" అనే డైలాగ్‌లు టీజర్‌లో వినిపించాయి.

'ది ప్యారడైజ్' హిందీ, తెలుగు, తమిళం, ఇంగ్లిష్, స్పానిష్, బెంగాలీ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది.

# ఆకట్టుకుంటున్న 'ఎపిక్' ట్రైలర్



బ్లాక్‌బస్టర్ హిట్ 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న కొత్త చిత్రం 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. యూత్‌ఫుల్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. '90s' వెబ్ సిరీస్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన ఆదిత్య హాసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి.ట్రైలర్‌ను బట్టి చూస్తే, ఈ సినిమా లండన్ కాలేజీ నేపథ్యంలో సాగే ఓ అందమైన ప్రేమకథ అని స్పష్టమవుతోంది. ప్రేమ, స్నేహం, భావోద్వేగాలు, జీవితంలోని మలుపులతో కథనం సాగనుంది. "ఒక ప్రేమకథ.. ఎన్నో భావోద్వేగాలు.. పూర్తికాని ఓ అధ్యాయం" అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దినట్టు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఆనంద్, వైష్ణవి మధ్య కెమిస్ట్రీ మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. వారిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలకు శ్రోతల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా విడుదలైన ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




# పాపరాజీపై సల్మాన్ ఆగ్రహం



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ మరోసారి పాపరాజీపై తన అసహనాన్ని ప్రదర్శించాడు. ప్రముఖ రియాలిటీ షో 'బిగ్ బాస్ 20' సెట్స్‌లో ఓ ఫొటోగ్రాఫర్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఇది నీ పని కాదు' అంటూ ఫొటోగ్రాఫర్‌కు చురకలంటించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సెప్టెంబర్ 6న ప్రారంభం కానున్న బిగ్ బాస్ 20 షో ప్రీమియర్ ఎపిసోడ్ షూటింగ్ శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా కౌబాయ్ తరహా దుస్తుల్లో స్టేజ్‌పైకి వచ్చిన సల్మాన్‌ను ఫొటోలు తీసేందుకు పాపరాజీలు పోటీ పడ్డారు. ఈ క్రమంలో కొందరు ఫొటోగ్రాఫర్లు ఆయన్ను 'బాబా' అని పిలుస్తూ ఫొటోలకు పోజులివ్వమని కోరారు.

దీంతో సల్మాన్ ఒక్కసారిగా అసహనానికి గురయ్యారు. "బాబా? యహ్ తేరా కామ్ నహీ హై. ముఝే కెమెరా కే ఆగే ఆనే కీ కోయీ జరూరత్ నహీ హై" (బాబా? ఇది నీ పని కాదు. నేను కెమెరా ముందుకు రావాల్సిన అవసరం లేదు) అంటూ తీవ్రంగా స్పందించాడు. వారు పదేపదే "ఫొటోస్.. ఫొటోస్.." అని అడగడంతో మరింత విసుక్కున్నాడు.

సల్మాన్‌కు, పాపరాజీలకు మధ్య పలుమార్లు ఇలాంటి ఘటనలు జరిగాయి. అయితే, ఈ వాగ్వివాదం తర్వాత సల్మాన్ కొందరు ఫొటోగ్రాఫర్లతో కలిసి ఫొటోలకు పోజులిచ్చినట్లు కూడా తెలుస్తోంది. మరోవైపు, ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో బిగ్ బాస్ 20 సెట్ నుంచి కొన్ని ఫొటోలను పంచుకున్నాడు.

# జోరు పెంచిన ఖుషీ కపూర్..

## జెన్ జీ కి బెస్ట్ చాయిస్!

దివంగత నటీమణి, అందాలతార శ్రీదేవి చిన్న కూతురుగా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ఖుషీ కపూర్. ఈమె తన సోదరి జాన్వీ కపూర్ రేంజ్ లో పాపులారిటీ సంపాదించుకోలేదు. కానీ ఈ మధ్యకాలంలో జెన్ జీ యువతను టార్గెట్ చేసుకొని చేస్తున్న పనులు , ఇస్తున్న ఫోజులు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అంతేకాదు ఈమెకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెడుతున్నాయి అనడంలో సందేహం లేదు. ప్రస్తుతం శ్రీదేవి గతంలో నటించిన మామ్ చిత్ర సీక్వెల్ మామ్ 2 లో తన దివంగత తల్లి శ్రీదేవి పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే .ముఖ్యంగా కరిష్మా తన్నాతో కలిసి ఖుషీ కపూర్ ఈ సినిమాలో నటిస్తోంది. ఒకవైపు ఆ సినిమా షూటింగ్లో బిజీగా ఉంటూనే..మరొకవైపు అద్భుతమైన ఫ్యాషన్ స్టోరీ తో ఆడియన్స్ ను ఆకట్టుకుంది. గ్రాజియా ఇండియా కవర్ పేజీపై భిన్నమైన ఆకృతులతో ఫోజులిచ్చి అభిమానులను మెస్మరైజ్ చేసింది . పైగా తన ట్రెండీ ఔట్ఫిట్ తో ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంది. ఫోటోషూట్ లో భాగంగా నాలుగు విభిన్నమైన లుక్స్ తో ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈమె అందులో ఒకటి ఆలివ్ కలర్ సీక్విన్డ్ కార్డిగాన్ టాప్ ధరించి, దీనికి కాంబినేషన్లో వాల్యూమినస్ డెనిమ్ లాంగ్ స్కర్ట్ ధరించి అవుట్ ఫిట్ తో ఆకట్టుకుంది. మరో లుక్ లో ఓవర్ సైజ్డ్ డెనిమ్ జాకెట్ ధరింది.. దీనికి కింద బ్లూ షర్ట్ పై వైట్ కలర్ చెక్స్ కలిగిన షర్టు ధరించింది. పైన బటన్స్ ఓపెన్ చేసి రెండు చేతులతో షర్టు పట్టుకున్న ఈమె.. దీనికి కాంబినేషన్లో డెనిమ్ ప్యాంట్ ధరించింది. తన మేకోవర్ ను ఫుల్ ఫీల్ చేసుకోవడానికి కలర్ఫుల్ డిజైన్ కలిగిన నెక్లెస్ ధరించింది.

# తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్

## ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు'...

'ఆ నలుగురు', 'అందరి బంధువయా' వంటి హృద్యమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న విలక్షణ దర్శకుడు చంద్ర సిద్ధార్థ్, మరో విభిన్నమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో, ఫిల్మోత్సవ్ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం.. "ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు". భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్‌గా నిలుస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 18న విడుదల కానుంది. ఈ చిత్రం ఒక హై-కాన్సెప్ట్ సైకలాజికల్ మిస్టరీ మ్యూజికల్ మూవీగా రూపుదిద్దుకుంది. దివంగత ప్రముఖ రచయిత, దర్శకుడు మదన్ అందించిన కథతో ఈ సినిమాను చంద్ర సిద్ధార్థ్ తెరకెక్కించారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఆ నలుగురు' క్లాసిక్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. సౌండ్ థెరపీ, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, అపరాధ భావన వంటి అంశాలను కథలో కీలక మలుపులుగా చూపిస్తూ, సంగీతం-మానవ మెదడు మధ్య ఉన్న సంబంధాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు చంద్ర సిద్ధార్థ్ మాట్లాడుతూ, "ఈ కథ నా స్నేహితుడైన మదన్‌తో కలిసి చేయాలనుకున్న ప్రాజెక్ట్. ఇది ఆయన చివరిగా ప్లాన్ చేసిన సినిమా. ప్రతిరోజూ రాత్రి 10:30 గంటలకు ఒక రేడియో స్టేషన్ నుంచి ఒకే పాట ప్రసారమవుతుంది. ఆ




పాటను నెమలిపాలెం నుంచి కొందరు వ్యక్తులు కోరుతుంటారు. అదే ఈ సినిమా టైటిల్ వెనుక ఉన్న రహస్యం. ధ్వని, న్యూరోసైన్స్, ప్రేమ వంటి అంశాలతో ముడిపడిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. ఇది ఒక ప్రయోగాత్మక ప్రయత్నం" అని వివరించారు.

ఈ చిత్రంలో హర్ష హీరోగా పరిచయం అవుతుండగా, అమైరా గోస్వామి, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ, అశోక్‌వర్ధన్, రేఖా నిరోషా కీలక పాత్రలు పోషించారు. జే రెక్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలో నాలుగు పాటలు ఉన్నాయి. మానవ సంబంధాలను సున్నితంగా ఆవిష్కరించే చంద్ర సిద్ధార్థ్, ఈసారి ఒక ఆధునిక థ్రిల్లర్‌తో ఎలాంటి మ్యాజిక్ చేస్తారోనని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com